RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 42 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ గురువారం 21-05-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

R N I No. APTEL/2012/53127

The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



ఏడాది తర్వాత మళ్లీ కలవనున్న..

## మోదీ, ట్రంప్

### విభేదాలు సమసిపోతాయా?

- ఫ్రాన్స్‌లో జరగనున్న జీ7 సదస్సుకు ప్రత్యేక అతిథిగా ప్రధాని మోదీకి ఆహ్వానం
- ఏడాది తర్వాత మళ్లీ డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం
- గతేడాది భారత్-పాక్ కాల్పుల విరమణ క్రెడిట్‌పై ఇరు నేతల మధ్య పెరిగిన దూరం
- నోబెల్ శాంతి బహుమతి కోసమే ట్రంప్ వ్యాఖ్యలు చేశారని అప్పట్లో విమర్శలు
- ఈ భేటీతోనైనా వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయో లేదోనని ఆసక్తి

2వ పేజీలో...

ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న

## మోదీ 'మెలోడీ' గిఫ్ట్!



2వ పేజీలో...

- ఇటలీ పర్యటనలో మోదీ
- ఆ దేశ ప్రధాని మెలోనికి 'మెలోడీ' చాక్లెట్ల గిఫ్ట్
- వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన మెలోని
- చాలా మంచి టోఫీలంటూ వ్యాఖ్య
- ఇద్దరి పేర్లను కలిపి 'మెలోడీ' అంటున్న నెటిజన్లు

రోమ్: భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్ ను నెటిజన్లు సరదాగా 'మెలోడి' అని పిలుస్తుంటారు. దీనిపై సోషల్ మీడియాలో ఎన్నో మీమ్స్ కూడా వచ్చాయి. అయితే ఈ క్రేజ్‌ను మోదీ భలే వాడుకున్నారు. తన ఇటలీ పర్యటనలో భాగంగా మెలోనికి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చి అందరినీ నవ్వించారు.



డాక్టర్ సౌమ్య స్వామినాథన్‌కు..

## అరుదైన గౌరవం

### రాయల్ సొసైటీ ఫెల్లోగా ఎంపిక

బ్రిటన్: భారత రత్న ఎంఎస్ స్వామినాథన్ అడుగుజాడల్లోనే ఆయన కూతురు సౌమ్య స్వామినాథన్ ప్రయాణిస్తున్నారు. తండ్రికి తగ్గ తనయగా అవతరించారు. బ్రిటన్‌కు చెందిన ద రాయల్ సొసైటీలో ఆమె అత్యంత అరుదైన గౌరవం దక్కింది. ఫెల్లో ఇన్ రాయల్ సొసైటీగా సౌమ్య స్వామినాథన్ ఎంపికయ్యారు. భారతీయ ప్రఖ్యాత శాస్త్రవేత్తల్లో ఆమె నిలిచారు. రాయల్ సొసైటీ ఫెల్లోగా ఆమెను మంగళవారం ఎంపిక చేశారు. రాయల్ సొసైటీ ప్రపంచంలోనే ఓల్డెస్ట్ సైంటిఫిక్ అకాడమీ. అత్యంత ప్రతిభావంతులైన సైంటిస్టుల కు మాత్రమే ఆ సొసైటీలో ఫెల్లోగా ఎంపికయ్యే అవకాశం దక్కుతుంది. రాయల్ సొసైటీలో సౌమ్య తండ్రి ఎంఎస్ స్వామినాథన్ కూడా ఫెలోషిప్ అర్హత సాధించారు. ఐజాక్ న్యూటన్ లాంటి శాస్త్రవేత్తలు ఉన్న రాయల్ సొసైటీ లీగ్‌లో సౌమ్య చేరారు. రాయల్ సొసైటీ ఫెలోషిప్‌కు సౌమ్య ఎంపికైన విషయాన్ని సీఎస్ఐఆర్ మాజీ అధ్యక్షుడు రఘునాత్ మస్లేకర్ ప్రకటించారు. ఎఫ్ఆర్ఎస్‌గా డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు.



నెట్ జీరో సిటీ తరహాలోనే

## ఫ్యూచర్ సిటీ

### అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన

### పరిశ్రమల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మే20 : ఫ్యూచర్ సిటీల పరిశ్రమల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులుకు సంబందించి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు.



2వ పేజీలో...

అద్భుతమైన విషయాన్ని కనిపెట్టిన

## చంద్రయాన్ ల్యాండర్

### సీక్రెట్‌గా ఉంచిన ఇస్రో!

- మిషన్ చివర్లో అరమీటర్ పైకి లేచిన ల్యాండర్
- రాకెట్ మంటల ధాటికి కొట్టుకుపోయిన చందమామ పైపొర
- బయటకు లోపల దాగున్న గట్టి నేల
- చంద్రుడిపై నేల పొరలుగా ఉందని అంచనా
- మూన్ బేస్ నిర్మాణానికి ఈ డేటా కీలకం



2వ పేజీలో...

## సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

### పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం

న్యూఢిల్లీ,మే20 : భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్టు తెలుస్తోంది. న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ సమావేశాలకు పుతిన్ హాజరవుతారని దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. జిన్‌పింగ్ కూడా ఈ సమావేశాలకు హాజరయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది.

## జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే



2వ పేజీలో...

### వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరణ

న్యూఢిల్లీ,మే20 : కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్ తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది.



2వ పేజీలో...

గ్రేటర్ ఎన్నికలకు..

## గులాబీ ప్లాన్

హైదరాబాద్, : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్యనగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్‌ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్‌తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకిదిగి, ఓటర్ల జాబితాసవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూకేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్‌బూత్ పరిధిలో ఓటర్లజాబితానుక్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్‌ఆదేశించారు. అయితే,ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కేటీఆర్..గ్రేటర్ హైదరాబాద్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు.



నేటి నుంచి సరస్వతి

## అంత్యపుష్కరాలు

### ఏర్పాట్లు పూర్తి చేశామన్న మంత్రి సురేఖ

వరంగల్,మే20 : సరస్వతి అంత్య పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. బుధవారం వరంగల్ లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కంచి పీఠాధిపతి విజయేంద్రస్వామితో కలిసి కొండ సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం బయట మంత్రి కొండా సురేఖ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అంత్య పుష్కరాలకు రూ. 200 కోట్లకు పైగా నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. రోజుకు ఒక స్వామిజీ స్నానంతో ఈ పుష్కరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పుష్కరాలు జరిగే ఈ పది రోజులు.. 10 మంది పీఠాధిపతులు వస్తారని వివరించారు. కాళేశ్వరంలో జరిగే ఈ సరస్వతి పుష్కరాల్లో ప్రతి రోజు సాయంత్రం గోదావరి హారతి ఇస్తారని చెప్పారు. లాగే ఈ పుష్కరాల సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని కొండా సురేఖ వివరించారు. ఈ పుష్కరాల సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున సేవలందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్



**మొదటిపేజీ తరువాయి...**

గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్ఏలకు అప్పగించారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏలను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు? లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్‌లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.

# ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న మోదీ 'మెలోడీ' గిఫ్ట్!

**మొదటిపేజీ తరువాయి...**

స్వీట్ గిఫ్ట్: ఐదు దేశాల పర్యటనలో భాగంగా రోమ్ చేరుకున్నారు మోదీ. ఈ సందర్భంగా మెలోనిని కలిసిన ఆయన.. భారత్‌లో ఎంతో పాపులర్ అయిన 'పార్లే మెలొడీ' చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇద్దరు నేతల పేర్లను కలిపి ఇంటర్నెట్‌లో నడుస్తున్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని మోదీ ఈ సరదా గిఫ్ట్ ప్లాన్ చేశారు.

వీడియో వైరల్: ఈ చాక్లెట్ ప్యాకెట్‌ను అందుకున్న మెలోని.. ప్రధాని మోదీతో కలిసి దిగిన ఒక చిన్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. 'బహుమతికి చాలా థాంక్స్' అని ఆమె రాశారు. వీడియోలో మెలోని మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ నాకోసం చాలా మంచి టోఫీలు తెచ్చారు' అనగానే, పక్కనే ఉన్న మోదీ నవ్వుతూ 'మెలొడీ' అని అన్నారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. గంట వ్యవధిలో లక్షకు పైగా లైక్స్, దాదాపు 9,000 కామెంట్స్, 25 వేలకు పైగా షేర్స్ వచ్చాయి.

కార్ డిప్లొమసీ: రోమ్ చేరుకున్న మోదీకి మెలోనీ ఘన స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి కార్‌లో ప్రయాణిస్తూ నగర వీధుల్లో సందడి చేశారు. తర్వాత రాత్రి పూట రోమ్‌లోని ప్రసిద్ధ చరిత్రాత్మక కట్టడం కొలోసియంను సందర్శించారు. అక్కడ కాసేపు నడుస్తూ ఇరు దేశాల మధ్య మైత్రిని మరింత బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

బహుమతిగా కాశీ చిత్రం: ఈ పర్యటనలో మోదీని ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు జాంపాలో టొమాసెట్టి కలిశారు. ఆయన స్వయంగా గీసిన వారణాసి (కాశీ) పెయింటింగ్‌ను మోదీకి బహుమతిగా ఇచ్చారు. టొమాసెట్టికి భారతీయ సంస్కృతిపై ఉన్న ఇష్టాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా అభినందించారు. రోమ్ నగరంలో కాశీ దృశ్యాలను చూడటం ఆనందంగా ఉందంటూ రాసుకొచ్చారు.

# నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ



**మొదటిపేజీ తరువాయి...**

కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు.

ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ ÷ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే

**మొదటిపేజీ తరువాయి...**

కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలుజోక్యంచేసుకోలేవని తెలిపింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్నిసీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్యా బాగ్చీ, విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది.

# డాక్టర్ సౌమ్య స్వామినాథన్‌కు అరుదైన గౌరవం..

**మొదటిపేజీ తరువాయి...**

శాస్త్రవేత్తలకు లభించే అత్యంత ఉన్నత గౌరవం ఇదే అని ఆయన అన్నారు. సౌమ్య తండ్రి భారత రత్న ఎంఎస్ స్వామినాథన్ కూడా ఎఫ్ఆర్ఎస్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. భారత్‌కు చెందిన తండ్రీకూతుళ్లు రాయల్ సొసైటీ ఫెలోషిప్ సాధించడం ఇదే మొదటిసారి అన్నారు. రాయల్ సొసైటీ 1660లో స్థాపించారు. శాస్త్రవేత్తలను గుర్తించడం, సైన్స్‌ను ప్రమోట్ చేయడం, ఆ రంగంలోని నిష్ణాతులను గౌరవించడం లాంటి కార్యక్రమాలను రాయల్ సొసైటీ చేస్తోంది. మానవాళికి ఉపయోగపడే సైన్సును వృద్ధి చేస్తోంది. సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ సొసైటీలో అర్హత సాధించిన భారతీయ రెండో మహిళా శాస్త్రవేత్తగా సౌమ్యా స్వామినాథన్ నిలిచారు. ఎఫ్ఆర్ఎస్ పొందిన తొలి మహిళా శాస్త్రవేత్తగా ప్రొఫెసర్ గగన్‌దీప్ కంగ్‌కు ఉంది. 2019లో ఆమె ఆ సొసైటీకి ఎంపికయ్యారు. ప్రఖ్యాత సైంటిస్టులు, ఇంజినీర్లు, టెక్నాలజిస్టులకు రాయల్ సొసైటీలో ఫెలోషిప్ కల్పిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేటి శాస్త్రవేత్తలను ఆ ఫెలోషిప్‌కు ఎంపిక చేస్తుంటారు. సైన్స్‌లో సాధించిన ఘనతల ఆధారంగా శాస్త్రవేత్తలకు గుర్తింపు ఇస్తుంటారు. ప్రస్తుతం రాయల్ సొసైటీలో సుమారు 1900 మంది ఫెల్లోస్ ఉన్నారు. దాంట్లో 85 మంది నోబెల్ బహుమతి గ్రహీతలు ఉన్నారు.

# సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

**మొదటిపేజీ తరువాయి...**

అయితే, చైనా అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటికే అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. 2019లో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ తరువాత 2020లో గాల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలు, 2022లో తవాంగ్ బోర్డర్ వద్ద ఉద్రికత్తల కారణంగా కొంతకాలం పాటు పరిస్థితులు గంభీరంగా మారాయి. ఆ తరువాత రష్యాలో కజాన్ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ, జిన్‌పింగ్‌లు సమావేశమయ్యారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం విషయంలో బ్రిక్స్ కూటమిలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్న వార్తల నడుమ తాజా సమవేశాలకు రష్యా, చైనా అధినేతలు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ శాఖ మంత్రులు, ప్రతినిధుల సమావేశంలో భేదాభిప్రాయాల కారణంగా దేశాల సంయుక్త ప్రకటన ఏదీ వెలువడలేదు.

# ఏడాది తర్వాత మళ్లీ కలవనున్న మోదీ, ట్రంప్..



**మొదటిపేజీ తరువాయి...**

ఢిల్లీ,: ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి రేకెత్తించే అతికొద్ది సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల భేటీ ఒకటి. గతేడాది వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాల తర్వాత ఇప్పుడు మళ్లీ వారిద్దరూ ముఖాముఖి కలుసుకునే అవకాశం కనిపిస్తోంది. ఫ్రాన్స్‌లో వచ్చే నెలలో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సు ఈ కలయికకు వేదిక కానుంది. ఈ భేటీతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గుతాయో లేదోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. జూన్ 15 నుంచి 17 వరకు ఎవియన్-లెస్-బెయిన్స్‌లో జరిగే ఈ సదస్సులో జీ7 సభ్య దేశాలు కాకపోయినా, ప్రత్యేక ఆహ్వానిత దేశంగా భారత్ పాలుపంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్‌ల మధ్య అధికారికంగా కాకపోయినా, కనీసం అనధికారికంగానైనా ఒక చిన్న సమావేశం (పుల్-అసైడ్ మీటింగ్) జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అనూహ్య శైలిని బట్టి చూస్తే, ఈ భేటీని కొట్టిపారేయలేం.

గతేడాది ఏం జరిగింది?: మోదీ, ట్రంప్ చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఆయన్ను కలిసిన తొలి ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు. ఆ సమయంలో మోదీని తన "గొప్ప స్నేహితుడు" అని అభివర్ణించిన ట్రంప్, 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఆ తర్వాత కొద్ది నెలలకే మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో తానే కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించుకున్నారు. నోబెల్ శాంతి బహుమతిని ఆశించి, తాను వాణిజ్యపరమైన బెదిరింపులతోనే అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధాన్ని ఆపానని ప్రతిచోటా ప్రచారం చేసుకున్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు పాకిస్థాన్ వంత పాడగా, భారత్ మాత్రం తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఇస్లామాబాద్‌తో నేరుగా జరిపిన చర్చల ఫలితమేనని, ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏడాది తర్వాత జరగబోయే ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# అద్భుతమైన విషయాన్ని కనిపెట్టిన చంద్రయాన్ ల్యాండర్..

**మొదటిపేజీ తరువాయి...**

ఢిల్లీ,: భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ ముగిసినా సరికొత్త అద్భుతాలను బయటపెడుతూనే ఉంది. 'శివశక్తి పాయింట్' వద్ద విక్రమ్ ల్యాండర్ చేసిన ఒక చిన్న ప్రయోగం ఇప్పుడు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. జాబిల్లి నేల గురించి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ నాసా సైతం అబ్బురపడే విషయాలు ఇస్రో ద్వారా వెలుగులోకి వచ్చాయి.

అనుకోకుండా చిన్న జంప్: చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్ తన ప్రయోగాలు పూర్తి చేసుకునే సమయానికి దానిలో కొంత ఇంధనం మిగిలింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు ముందుగా ప్లాన్ చేయని ఒక సాహసం చేశారు. ఇంజిన్లను మళ్లీ మండించి విక్రమ్‌ను చంద్రుడి ఉపరితలం నుంచి 50 సెంటీమీటర్ల పైకి లేపి పక్కకు కాస్త దూరంలో ల్యాండ్ అయ్యేలా చేశారు. టెక్నాలజీ పరంగా ఇది భారత్‌కు ఒక పెద్ద విజయమైనా సైంటిఫిక్‌గా అంతకంటే పెద్ద రహస్యం దీనివల్ల బయటపడింది.

కొట్టుకుపోయిన పైపొర: ల్యాండర్ ఇంజిన్లు మళ్లీ మండటంతో ఆ మంటల ధాటికి చంద్రుడిపై ఉన్న 3 సెంటీమీటర్ల పైపొర గాల్లోకి లేచింది. పైన ఎంతో మెత్తగా, దూదిలా ఉండే పొడి మట్టి తొలగిపోవడంతో.. దాని కింద ఎప్పుడూ ఎండ తగలని సరికొత్త మట్టి పొరలు ల్యాండర్‌లోని చాస్టే పరికరానికి చిక్కాయి. ఇలా ఎలాంటి డ్రిల్లింగ్ మిషన్ లేకుండానే చంద్రుడి అంతర్భాగంలో ఉన్న మట్టిని పరిశీలించే అరుదైన అవకాశం శాస్త్రవేత్తలకు దొరికింది.

చందమామ నేల 'కేక్' లాంటిది: ఈ ప్రయోగం ద్వారా వచ్చిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు చంద్రుడి ఉపరితలం 'కేక్'లా పొరలు పొరలుగా ఉందని తేల్చారు. పైన ఉండే మట్టి ఎంతో వదులుగా, పొడి పిండిలా ఉంటే.. కేవలం 6 సెంటీమీటర్ల లోతులోనే అది తడి జిగురు మట్టిలా చాలా గట్టిగా మారిపోతోంది. అంటే తక్కువ దూరంలోనే నేల స్వభావం పూర్తిగా మారిపోతోందని స్పష్టమైంది. ఈ రకమైన వైవిధ్యం గతంలో అమెరికా అపోలో మిషన్లు వెళ్లిన భూమధ్యరేఖ ప్రాంతంలో ఎక్కడా కనిపించలేదు.

నాసాకు ఎలా ఉపయోగపడుతుంది?: నాసా తన ప్రతిష్ఠాత్మక 'ఆర్టెమిస్' మిషన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై మనుషులను దించి అక్కడ శాశ్వత స్థావరాలనునిర్మించాలని చూస్తోంది. చందమామ ఇలా మారుతుందని ఇస్రో కనిపెట్టడం వల్ల.. అక్కడ భవిష్యత్తులో ఇళ్లు కట్టాలన్నా, దిగాలన్నా ఈ పొరల స్వభావం ఎంతో ముఖ్యం. పైగా ఈ పొరలే చంద్రుడి లోపల ఉన్న మంచు గడ్డకట్టేలా కాపాడుతున్నాయని తెలియడంతో భవిష్యత్ మిషన్లకు ఇదొక గైడ్‌లా మారబోతోంది.

# టూరిజం అభివృద్ధికి కృషి చేస్తా




## టూరిజం శాఖ అధికారి పరంధామ రెడ్డి

చుంచుపల్లి మే 20 (తెలంగాణ వాణి): 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా బుధవారం టూరిజం శాఖ అధికారి ప్రాణమా రెడ్డి ఆధ్వర్యంలో టూరిజం వారోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మూడవరోజు హెరిటేజ్ వాక్ ను లక్ష్మీదేవి పెల్లి మండలంలోని కారుకొండ రామవరం ప్రాంతంలో గల పురాతన బౌద్ధ గృహలను, పురాతన కట్టడాల వాటి ప్రాముఖ్యతను నేటి యువతకు తెలియజేయాలని ఉద్దేశంతో 100 మంది యువతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బావి తరాలకు ఈ పురాతన ప్రదేశాలు అందుబాటులో ఉండే విధంగా వీటి ఉనికిని కాపాడాలని యువతతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ఈ ప్రాంతాలను పర్యాటకులు సందర్శించే విధంగా, ఈ బౌద్ధ గృహాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా టూరిజం శాఖ అధికారి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రెసిడెంట్ కొచ్చర్ల కమల రాణి, కమిటీ మెంబర్స్ లక్ష్మి, జోష్ణ, హాకీ కోచ్ ఇమామ్, ఆర్చరీ కోచ్ కళ్యాణి, అథ్లెటిక్ కోచ్ మల్లికార్జున్, నాగేంద్ర, జిల్లా బాక్సింగ్ సెక్రటరీ మట్టపర్తి రమేష్, అఖిల్, యువత, క్రీడాకారులు, ఆఫీస్ సిబ్బంది లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గోవాలో ఘనంగా అంతర్జాతీయ డిఫెండర్స్ అవార్డ్స్

## నాగ్‌పురి అశ్విని, విజయ సాగల డిఫెండర్ అవార్డులు...



మేడ్చల్ జిల్లా(తెలంగాణ వాణి)మే 20:మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ డివిజన్‌కు చెందిన మహిళలకు అంతర్జాతీయ గుర్తింపుగోవా రాష్ట్రంలోని మండోవి నదిపై ఏర్పాటు చేసిన క్రూయిజ్‌లో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ (ఐ హెచ్ ఆర్ ఎఫ్)ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ డిఫెండర్స్ అవార్డ్స్ 2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ డివిజన్‌కు చెందిన మహిళా సామాజిక కార్యకర్తలు నాగ్‌పురి అశ్విని, విజయ సాగలకు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డులు అందజేయడం జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. ఐ హెచ్ ఆర్ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్న నాగ్‌పురి అశ్విని కి ఇంటర్నేషనల్ డిఫెండర్స్ అవార్డు ప్రదానం చేయగా, జన్మభూమి నగర్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త విజయ సాగల గారికి హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఐ హెచ్ ఆర్ ఎఫ్ జాతీయ చైర్మన్ మరియు వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది కొంగర అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, 2014లో ప్రారంభమైన ఐ హెచ్ ఆర్ ఎఫ్ సంస్థ నేడు దేశవ్యాప్తంగా వేలాది సభ్యులతో మానవ హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది అని అన్నారు. బాల్య వివాహాల నివారణ, గృహ హింసకు గురైన మహిళలకు అండగా నిలవడం, బాధితులకు న్యాయ సహాయం అందించడం, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాటం చేయడం వంటి అంశాల్లో ఈ ఇద్దరు మహిళలు విశేష సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. విజయ సాగల ఇప్పటికే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు, నారీ శక్తి పురస్కారం మహిళ విజయ స్టార్ మహి అవార్డు వంటి అనేక గౌరవాలు అందుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ప్రజలు, మహిళా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు నాగ్‌పురి అశ్విని మరియు విజయ సాగలకు అభినందనలు తెలియజేస్తూ వారి సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## సంపాదకీయం

### ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్–అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది.పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది.కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టీ ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూ నిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటవే మూలం.సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విబేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది.బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది.నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి. కమ్యూనిస్టు పార్టీలకు అనేక ఆంక్షలు ఉన్నా శ్రామికుల సమ్మెలు, రైతాంగ ఉద్యమాలలో పార్టీ గ్రూపులు పనిచేస్తూనే వస్తున్నాయి.

# అక్రమ వెంచర్లు.. అడ్డగోలు విక్రయాలు



నల్లగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రామాజీ పేట గ్రామంలో సర్వేనెంబర్ 92 లో ఫామ్ ల్యాండ్ ప్లాట్ల తో కూడిన వెంచర్ ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ లో 121 గజాల తో ప్లాట్లు లే అవుట్, 30 ఫీట్ల తో రోడ్లు నిర్మించారు. ఈ ప్లాట్ లలో దాదాపు పది రకాల మొక్కలను పెంచుతున్నారు. వాటిల్లో మామిడి, సపోటా, బత్తాయి, దానిమ్మ బొప్పాయి, పనస, జామ పండ్ల మొక్కలను డ్రిప్ సిస్టం ద్వారా నీరు సరఫరా చేసి మొక్కలను కాపాడుతున్నారు . సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అనువైన ధరలో ప్లాట్లు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని, సోషల్ మీడియా లో ఫేస్బుక్ వేదికగా అందమైన వీడియోలు తీసి విక్రయానికి పెట్టారు. "" వి జె ఆర్ డెవలపర్స్"" పేరుతో కొన్ని ఎకరాల భూమి కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతి లేకుండానే వెంచర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడానికి అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యాపారానికి తెరలేపారు.

వెంచర్లు చేయాలంటే నిబంధనలు..: భూమి వ్యవసాయ భూమి అయితే, దానిని నాన్–అగ్రికల్చరల్ ఉపయోగం కోసం మార్చడానికి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుండి అనుమతి తీసుకోవాలి.లే అవుట్ ప్లాన్‌ను స్థానిక అధికారులు లేదా డెవలప్‌మెంట్ అథారిటీ ఎవీణూ, ఋజ్వా, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఆమోదించాలి. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (DTCP) లేదా స్థానిక పంచాయతీ అధికారుల నుండి అనుమతి అవసరం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA),లే అవుట్ ప్లాన్‌లో రోడ్లు, ఓపెన్ స్పేస్‌లు, డ్రైనేజీ, నీటి సరఫరా వంటి సౌకర్యాలకు సంబంధించిన నిబంధనలు పాటించాలి. రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్, 2016ప్రకారం, 500చదరపు మీటర్లు లేదా8 ప్లాట్‌లకు మించిన లే అవుట్ ప్రాజెక్ట్‌లు రాష్ట్ర RERA పోర్టల్‌లో నమోదు చేయాలి. RERA నమోదు కస్టమర్లకు పారదర్శకతను నిర్ధారిస్తుంది. చట్టపరమైన రక్షణను అందిస్తుంది. ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్, భూమి పర్యావరణ సున్నితమైన ప్రాంతంలో ఉంటే ( నీటి వనరులు, అడవుల దగ్గర), స్టేట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (SEIAA) నుండి అనుమతి ఉండాలి.

పంచాయతీ నుండి అనుమతి తప్పనిసరి..: లే అవుట్‌లో భవన నిర్మాణాలు ఉంటే, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఫైర్ డిపార్ట్‌మెంట్ నుండి చీూజ తీసుకోవాలి.స్థానిక పంచాయతీ/ మున్సిపల్ అనుమతులు,స్థానిక గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల నుండి లే అవుట్ అనుమతి తీసుకోవాలి, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాల కోసం కొన్ని సందర్భాల్లో, భూమి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటే, పంచాయతీ నుండి అనుమతి తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిర్దిష్ట గవర్నమెంట్ ఆర్డర్‌లు (GOs) లేదా రెగ్యులేషన్‌లకు అనుగుణంగా ఉండాలి. ఉదాహరణకు, అనుమతి లేని లే అవుట్‌లలో ప్లాట్లు కొనడం వల్ల కొనుగోలుదారులు ఇబ్బందులు పడవచ్చు. RERA పోర్టల్‌లో వెంచర్ నమోదైందా? నిర్ధారించుకోవాలి. ఇవన్నీ పాటించకుండానే కోట్ల రూపాయల కొల్లగొట్టి ప్రజలను మోసం చేస్తున్న వెంచర్లపై రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎలాంటి పర్మిషన్లు లేవు...!: వెంచర్ చేయాలంటే డిటి సిపి, రేరా గ్రామపంచాయతీకి 10% ల్యాండ్ మార్టిగేజ్ చేసిన తర్వాత రోడ్లు, విద్యుత్తు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇతర పనులు డెవలప్మెంట్ చేసి ప్లాట్లు విక్రయించాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయడం ఎందుకు అని అడ్డదారిలో ప్లాట్లు అమ్మే సౌకర్యాన్ని " వి జె ఆర్ డెవలపర్స్" పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెరదీశారు.

అందమైన బ్రోచర్లతో వల: అందమైన బ్రోచర్లు, లే అవుట్ ప్లాన్ తో అమ్మడానికి సిద్ధమైన వెంచర్ బాగోతం అంతా ఇంతా కాదు. భూభారతిలో స్లాట్ బుక్ చేసుకొని వ్యవసాయ భూమిగా గుంటలుగా స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో రిజిస్టర్ చేస్తారు. ఆ తర్వాత నాలా కన్వర్షన్ తహాశీల్దార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసి ఆ ప్రొసిడింగ్ లో గజాల చొప్పున మళ్లీ నియోజకవర్గ కేంద్రాలలో ఉండే యాదగిరి గుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేస్తారు. ఇలా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్లు చేస్తూ గ్రామపంచాయతీ ఆదాయానికి, ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ కొనుగోలుదారులను, ప్రజలను మోసం చేస్తున్నారు. ప్లాటు కొన్న తర్వాత చట్టప్రకారం అన్ని పర్మిషన్లు ఉంటేనే గ్రామ పంచాయతీలో నమోదు చేసుకుంటారు. ఇలా కొనుగోలు చేసిన డాక్యుమెంట్తో కొనుగోలు దారుడు గ్రామపంచాయతీలో నమోదు చేసుకోవడానికి వెళితే ఆవెంచర్కు పర్మిషన్ లేదని సమాధానం ఎదురవుతున్నది. ధనార్జనతో మోసాలకు తెగబడుతున్న వెంచర్ల నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉన్నది.

## మంజూరైన పనులు మొదలు పెట్టండి



భూత్పూర్ : మంజూరైన పనులను వెంటనే మొదలుపెట్టాలి అని దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ కోరారు. బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశం, కో ఆప్షన్ సభ్యుల నియామక కార్యక్రమాలకు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ పాలకోటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇప్పటికే పెద్ద ఎత్తున ఖర్చు చేసినట్టు తెలిపారు. మంజూరైన పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలి అని సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన చోట్ల కొత్త పార్కుల ఏర్పాటు, డ్రైనేజీ కాలువలు నిర్మాణాలు అవసరం ఉంటే వెంటనే గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేయాలని చైర్మన్, మున్సిపల్ కమిషనర్, సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా రూపొందించాలని ఎమ్మెల్యే కోరారు.

కోఆప్షన్ సభ్యులకు నియామక పత్రాల అందజేత:నూతనంగా కోఆప్షన్ సభ్యులుగా నియామకమైన కోరే పవన్ కుమార్, లావణ్య, తన్వీర్ సుల్తానా, అఫ్రోజ్ కు ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



మహాముత్తారం : వరి కల్లం వద్ద నిలువ ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మహముత్తారం మండలం బోర్లగూడెంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మద్దతుగా కుల సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ అజ్మీరా ఫుల్ సింగ్ నాయక్ మాట్లాడుతూ గత వారం నుంచి కల్లంలోనే వరి ధాన్యం ఉందని, లారీలను టెండర్ దారుడు తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి వెంటనే లారీలు సరఫరా చేయాలని కోరారు. లారీలను వెంటనే పంపాలని నినాదాలతో రైతులు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు.

చరవాణి ద్వారా మహముత్తారం తాసిల్దార్ దండు శ్రీనివాస్ సాయంత్రం వరకు లారీలను పంపిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నా లొ రైతులు ఠాకూర్ లక్ష్మణ్, వెంకట్రాజ్యం, బానోత్ దేవుసింగ్, ఠాకూర్ రవి, మొగిలి రమేష్, సురెడ్డి నర్సింహా రెడ్డి,శ్రీధర్, సింగన వేణి తిరుపతి, లావుడ రమేష్ తెలిపారు.

## "నేనే సీఎం పీఏ" అంటూ వ్యాపారులకు బెదిరింపులు.. కేటుగాడు అరెస్ట్



మేడ్చల్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఎం, మంత్రుల పేర్లు చెప్పుకుంటూ వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న కేటుగాడిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ శంకర్ రెడ్డి మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా శివ్వంపేటకు చెందిన సంతోష్ గుప్తా అనే వ్యక్తి మేడ్చల్ పరిధిలోని మునీరాబాద్‌లో ఆర్.ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాహకుడికి ఫోన్ చేసి "నేను సీఎం మనిషిని.. సీఎం రేవంత్ రెడ్డి పీఏని.. పీసీసీ సభ్యుడిని" అంటూ పరిచయం చేసుకున్నాడు. మీ భూమికి సంబంధించిన సమస్యలు ఉన్నాయి.. వాటిని నేను సెటిల్ చేస్తానని చెప్పి, ప్రతిఫలంగా ఐదు విల్లాలను తనకు విక్రయించి నగదు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా "వచ్చి కలవకపోతే మీ పని చేస్తా" అంటూ బెదిరింపులకు దిగడంతో బాధితుడు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న మేడ్చల్ పోలీసులు నిందితుడిపై నిఘా పెట్టి అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సంతోష్ గుప్తా పలుచోట్ల సీఎం, మంత్రుల పేర్లు ఉపయోగిస్తూ వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చినట్లు ఏసీపీ వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కరీంనగర్ లోని జ్యువెలరీ షోరూంలు, హోటళ్లలో..

## సిపి గౌస్ ఆలం ఆకస్మిక తనిఖీలు

**భద్రతా ప్రమాణాలు,సీసీ కెమెరాల పనితీరుపై ముమ్మ ర తనిఖీలు.**

**షోరూంలలో మెటల్ డిటెక్టర్లు,ఎమర్జెన్సీ అలారాలు తప్పనిసరి.**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు పోలీస్ కమిషనర్ హెచ్చరిక.**



కరీంనగర్:మే 20 (తెలంగాణ వాణి ప్రతినిధి) నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా బుధవారం కరీంనగర్ నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో పోలీసులు పలు బంగారు ఆభరణాల షోరూం లు,లాడ్జీలు,బస చేసే హోటళ్ల లో ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు.ఈ తనిఖీల్లో అడిషనల్ డీసీపీ వెంకట రమణ,ఏసీపీలు వెంకట స్వామి,వేణుగోపాల్,వాసాల సతీష్,ఇన్స్పెక్టర్ రాంచందర్ రావుతో పాటు స్థానిక పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ గౌస్ ఆలం హోటళ్లు, జ్యువెలరీ షోరూంల నిర్వాహకుల కు పలు కీలక సూచనలు,ఆదే శాలు జారీ చేశారు: బంగారు ఆభరణాల షోరూంలలో కట్టుదిట్టమైన భద్రత:జ్యువెల రీ దుకాణాల్లో ఖచ్చితంగా అర్హత గల భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సిపి సూచించారు.షోరూంల ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ లోపలికి వచ్చే వారిని తనిఖీ చేయడానికి హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ల ను ఖచ్చితంగా ఉపయోగించాలని ఆదేశించారు.

?ఎమర్జెన్సీ అలారమ్స్ ఏర్పా టు:అత్యవసర సమయాల్లో అప్రమత్తం చేయడానికి దుకాణాల్లో పలు చోట్ల 'ఎమర్జెన్సీ అలారమ్స్' అమర్చాలని, వాటిని నొక్కిన వెంటనే పోలీసులకు సమా చారం అందేలా అధునాతన సాంకేతికతను అనుసంధానం చేసుకోవాలన్నారు.

?హోటళ్లు,లాడ్జీల నిర్వాహకు లకు ఆదేశాలు:హోటళ్లలో రూమ్ లు అద్దెకు ఇచ్చే సమయంలో కస్టమర్ల నుంచి ఖచ్చితంగా ఆధార్ కార్డ్ లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులను సేకరించాలి.వారు ఇచ్చే ఫోన్ నంబర్లను క్రాస్ చెక్ (నిజమా కాదా అని సరిచూసుకోవడం) చేసుకోవాలి.ఎవరైనా అను మానాస్పదంగా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలి.సీసీ కెమెరాల పర్యవేక్షణ: అన్ని వ్యాపార సముదాయా లు,హోటళ్లలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలాచూసు కోవాలని, వాటి విజువల్స్‌స్పష్టంగా ఉండేలా బ్యాకప్ సామర్థ్యం సరిగ్గా ఉండాలని స్పష్టం చేశారు. నగరంలో ప్రజల ఆస్తి,ప్రాణ రక్షణకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని, వ్యాపార సంస్థల నిర్వాహకు లు పోలీసుల నిబంధనలకు లోబడి వ్యాపారాలు నిర్వ హించి,నగర భద్రతలో భాగ స్వాములు కావాలని సిపి గౌస్ ఆలం పిలుపునిచ్చారు. భద్రతా ప్రమాణాల్లో అలస త్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## సిరిచెల్మ ఆలయంలో ఘనంగా 'హెరిటేజ్ వాక్' నిర్వహణ

ఇచ్చోడ మే 20 (తెలంగాణ వాణి) ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చోడ మండలంలోని ప్రసిద్ధ సిరిచెల్మ ఆలయంలో 'హెరిటేజ్ వాక్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ బంగారిగూడ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆలయ చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను తెలుసుకున్నారు. స్థానిక వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థుల్లో పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ హెరిటేజ్ వాక్ నిర్వహించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిరిచెల్మ ఆలయ చరిత్ర, స్థానిక సంస్కృతి, పర్యాటక ప్రాధాన్యతతో పాటు పర్యాటక




రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి




రవికుమార్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బాలికలకు భరోసా అందరి బాధ్యత




సమాజం పురోగతికి నిజమైన కొలమానం మహిళలకు, ముఖ్యంగా బాలికలకు లభించే భద్రత, గౌరవం, న్యాయంలోనే ఉంటుంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన మన రాష్ట్రానికి చెందిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కుమారుడిపై పోక్సో కేసు నమోదు కావటం ఒక చేదు నిజాన్ని బట్టబయలు చేసింది. చట్టాలు ఎన్నో ఉన్నా, సెక్షన్లు ఎన్నెన్ని ఉన్నా, పోరాటాలు ఎన్ని జరిగినా..అధికార బలం, అంగబలం, ఆర్థిక బలంఉన్నవారి ఎదుట బాధితులు ఇంకా న్యాయం కోసం పోరాడాల్సిన పరిస్థితి పూర్తిగా మారలేదని ఈ ఘటన స్పష్టం చేసింది. చట్టం లక్ష్యం ఏమిటి? వాస్తవం ఏమిటి? పోక్సో చట్టం ఒక స్పష్టమైన లక్ష్యంతో రూపొందింది. 18 ఏండ్లలోపు బాలికలను లైంగిక నేరాల నుంచి రక్షించటం, నేరస్థులపై కఠిన శిక్షలు విధించటం, మైనర్లకు అనుకూలమైన విచారణ వాతావరణాన్ని కల్పించటం, వారి గోప్యతను కాపాడటం, త్వరితగతిన న్యాయం అందించటం. తాజాగా పోక్సో కేసు వెలుగుచూసిన తర్వాత ప్రజల మనసులో మెదిలే ప్రశ్న ఒక్కటే..చట్టాలు పుస్తకాల్లో ఉన్నంత బలంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? మైనర్ బాలికపైనే విచారణ ఎందుకు? ఒక బాలిక ధైర్యంగా తనకు జరిగిన అన్యాయాన్ని బయటపెట్టినప్పుడు, సమాజం ఆమెకు అండగా నిలబడాలి. కానీ మనం చూస్తున్నది దానికి పూర్తి విరుద్ధం. ఆమె వయస్సును ప్రశ్నించటం, కుటుంబాన్ని అవమానించటం, వ్యక్తిత్వ హననానికి దిగజారటం వంటి చర్యలు అమానుషం. అంతకంటే బాధాకరమైన విషయం ఏమిటంటే, కొంతమంది రాజకీయ నేతల అనుచరులు, డబ్బులు తీసుకుని పనిచేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ఆ బాలిక, ఆమె కుటుంబం గురించి తప్పుడు కథనాలను వ్యాప్తి చేస్తూ, ఆరోపణల తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయటం. ఆమె విశ్వసనీయతను దెబ్బతీయడానికి ప్రత్యామ్నాయ కథనాలు సృష్టించటం సమాజం సిగ్గుపడాల్సిన విషయం. పోక్సో చట్టం మైనర్ల గౌరవాన్ని కాపాడటమే లక్ష్యంగా పెట్టుకున్నది. అలాంటప్పుడు అదే గౌరవాన్ని బహిరంగంగా దెబ్బతీయటం మరింత ఆందోళనకరం. ఈ కేసులో ఆరోపణల తీవ్రత ఉన్నప్పటికీ, ఎఫ్ఐఆర్ ఆలస్యంగా నమోదు కావటం, నిందితుడిని వెంటనే అరెస్టు చేయకపోవటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ఇదే స్థానంలో ఒక సాధారణ వ్యక్తి ఉంటే ఇదే విధానం ఉండేదా? అనే ప్రశ్న అనివార్యంగా తలెత్తుతున్నది. ఈ సంఘటన బయటపెట్టిన చేదునిజాలు కొన్ని సందర్భాల్లో ప్రధాన మీడియా పూర్తిగా మౌనం వహించగలదు. రాజకీయ పలుకుబడి, అధికారం దర్యాప్తులను ప్రభావితం చేసే ప్రమాదం ఉన్నది. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే, అది ప్రజాస్వామ్యానికే ముప్పు. న్యాయం కోరుతున్న ఒక బాలికపై వేసిన నిందలు, రకరకాల వేధింపులు మన సామాజిక బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వ్యవస్థలు మౌనం వహించిన ఈ చీకటిలో ఆశ చూపింది ఒక్కటే..ప్రజల గొంతు. సామాజిక మాధ్యమాల వేదికగా సామాన్య పౌరులు చేసిన నిరంతర పోరాటం, ప్రశ్నించటం, ఒత్తిడి తేవటం వల్లే ఈ కేసు ముందుకు సాగింది. ఈ విషయాన్ని ప్రజా చర్చలో సజీవంగా ఉంచింది ప్రజలే. ఈ ఒత్తిడి లేకపోతే కేసు ఇంత దూరం వచ్చేదా? అరెస్టులు జరిగేవా? అనే ప్రశ్నలు ప్రజల్లో సహజంగానే తలెత్తుతున్నాయి. ఇది రాజకీయ అధికార దుర్వినియోగంపై ప్రజల ఐక్యత సాధించిన విజయం. న్యాయంపై నమ్మకం నిలవాలంటే నిందితుడి అరెస్టు కేవలం ఆరంభం మాత్రమే; అంతిమ న్యాయం కాదు. కేసు ఇంకా కొనసాగుతున్నది. పలుకుబడి ఉన్న రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు, దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా, ఎలాంటి జోక్యం లేకుండా జరగాలి. ఈ నేపథ్యంలో సంబంధిత కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలి. ఇది రాజకీయ డిమాండ్ కాదు; న్యాయ ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టటానికి అవసరమైన చర్య. ఆ వ్యక్తి అధికారంలో ఉన్నంతకాలం దర్యాప్తు పూర్తిగా స్వతంత్రంగా జరుగుతుందని ప్రజలకు నమ్మకం కల్పించటం కష్టం. ఒక బాలికకు న్యాయం జరిగేలా చూడటానికి, దర్యాప్తుపై ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి ప్రభావం ఉండకూడదు. పదవి కంటే న్యాయం గొప్పది. అధికారం కంటే చట్టం గొప్పది.ముగింపు: ఇది కేవలం ఒక బాలిక వ్యక్తిగత విషయం కాదు. ఇది మన కుమార్తెల భవిష్యత్తు, భద్రతకు సంబంధించిన ప్రశ్న. 'నువ్వు ఒంటరివి కావు, నీ వెనుక సమాజం ఉన్నది' అనే నమ్మకాన్ని ప్రతి బాలికకు కల్పించాల్సిన బాధ్యత మనందరిది. న్యాయం కోసం పక్షపాతాలకు అతీతంగా ఐక్యంగా నిలబడటం మనందరి సామాజిక బాధ్యత. బాలికకు దక్కాల్సిన గౌరవం, రక్షణ, న్యాయం..ఇవి రాజకీయ నినాదాలు కాదు; రాజ్యాంగం కల్పించిన హక్కులు.

## పౌడర్ పూసుకుంటే కానీ గుర్తుపట్టని ఉపాధి సైట్ కార్మికుడు..!



ముత్తారం: మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు చేసే ఓ వృద్ధ కార్మికుడు పౌడర్ పూసుకుంటే కానీ గుర్తుపట్టని పరిస్థితి ఏర్పడింది. ఉపాధి సైట్ ముత్తారంలో రామాయణంలో తనదైన శైలిలో రోజు మేకప్‌తో సీత పాత్ర, రాముని పాత్ర.. ఇలా అనేక పాత్రలు వేసిన తను తన ప్రత్యేక శైలితో అందరి దృష్టిని ఆకర్షించాడు. అందుకేనేమో ప్రతిరోజూ ఉపాధి హామీపనికి వెళ్లే ముందు ముఖానికి తెల్లని పౌడర్ పూసుకుని, నుదిటిపై ఎర్రటి బొట్టు పెట్టుకుని సైట్‌కు హాజరు అయితేనే గుర్తిస్తుంది. గ్రామస్తులు ఆయనను చూసి ఆశ్చర్యపోతున్నారు. "పౌడర్ పూసుకోకపోతే ఎవ్వరూ గుర్తుపట్టరు బాబూ..." అంటూ చిరునవ్వుతో చెప్పే ఈ వృద్ధుడు, తన సరదా మాటలతో కార్మికుల మధ్య నవ్వులు పూయిస్తున్నాడు. వయస్సు మీద పడినా కష్టపడే తత్వం మాత్రం తగ్గలేదని తోటి కార్మికులు చెబుతున్నారు. సాధారణ దుస్తుల్లో కనిపించే ఆయన, ముఖానికి పౌడర్ పూసుకుని వస్తే మాత్రం ప్రత్యేక వ్యక్తిలా కనిపిస్తారని గ్రామస్తులు అంటున్నారు. ఉపాధి పనుల మధ్యలోనూ తన హాస్యంతో అందరినీ అలరించే ఈ పెద్దాయన ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారారు. "కష్టపడి పని చేస్తూనే నవ్వుతూ జీవించడం కూడా ఒక కళే" అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# తిరుమల గిరులు కళకళ

## దేశంలోనే రికార్డ్...

తిరుపతి, : 89.40 శాతం పచ్చదనంతో తిరుమల గిరులు కళకళలాడుతున్నాయి. అరణ్య సంపద పరిరక్షణలో టీటీడీ అటవీ శాఖ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. స్థానిక వృక్ష సంపద పునరుద్ధరణకు విస్తృత చర్యలు తీసుకుంటున్నారు. 576 హెక్టార్లలో స్వదేశీ మొక్కల పెంపకం చేపట్టారు. ప్రత్యేక నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరా చేస్తున్నారు. ఏనుగులు, చిరుతలు సహా వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకున్నారు. ఆలయ పూజ కైంకర్యాలలో అటవీ శాఖ పాత్ర కీలకంగా మారిందితిరుమల గిరులు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.. ఏకంగా 89.40 శాతం పచ్చదనం కనిపిస్తోంది. 1980 నుంచి టీటీడీ అటవీ శాఖ శేషాచల అరణ్య సంపదను పరిరక్షిస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుతోంది. కోట్లాది మంది భక్తుల ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తోంది. తూర్పు కనుమల్లో విస్తరించిన పవిత్ర శేషాచల పర్వత శ్రేణుల్లోని అరణ్య ప్రాంతాలను సంరక్షిస్తూ జీవ వైవిధ్య పరిరక్షణలో కీలకంగా మారింది. టీటీడీ అటవీ విభాగ పరిధిలో మొత్తం 2719 హెక్టార్ల విస్తీర్ణంలో అరణ్య ప్రాంతం ఉంటే.. తాజా ఐఎస్ఎఫ్ఆర్ (ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక) ప్రకారం 89.40 శాతం మేర అటవీ ప్రాంతం నమోదైంది. దేశంలోనే అత్యుత్తమైన స్థానంలో నిలిచింది. దాదాపు 2431 హెక్టార్లలో అటవీ ప్రాంతాలు ఉండగా.. వాతావరణ నియంత్రణ, జీవ వైవిధ్య సంరక్షణకు దోహదపడుతున్నాయి.డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆధ్వర్యంలో టీటీడీ అటవీ విభాగం కొనసాగుతోంది. మొత్తం నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లు తిరుమలలో రెండు, తిరుపతిలో రెండు చొప్పున ఉన్నాయి. ఇలా ప్రతి రేంజ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఉంటుంది. అటవీ పరిరక్షణను ఫీల్డ్ స్థాయిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది సమన్వయంతో చేపడుతున్నారు. 24 గంటల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పహారా ఉంటూ అటవీ సంపద సంరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరు అక్రమ చెట్ల నరికివేత, వేట చర్యలను అరికడుతున్నారు. అటవీ అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక ఫైర్ లైన్లతో పాటుగా శిక్షణ పొందిన బృందాలు అగ్నిమాపక చర్యలు చేపడుతున్నాయి. ప్రతి ఏంటా 26.5 లక్షల చదరపు మీటర్ల మేర ఫైర్ లైన్లు నిర్వహిస్తున్నారు. టీటీడీ జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా విదేశీ జాతికి చెందిన అకేషియా చెట్ల స్థానంలో స్థానిక వృక్ష సంపదను పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టింది. మొత్తం 576 హెక్టార్లలో స్థానిక జాతులైన గంధం, ఎర్రచందనం, ఉసిరి, నేరేడు, రావి, మర్రి, జువ్వి, మేడి, సంపంగి, మామిడి వంటి మొక్కలను దశలవారీగా నాటుతున్నారు. ఇప్పటివరకు 22 హెక్టార్లలో పనులు పూర్తయ్యాయి. అంతేకాదు టీటీడీ పరిధిలోని నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లలో ప్రత్యేక నర్సరీలను నిర్వహిస్తున్నారు. అక్కడ స్థానిక జాతుల మొక్కలు, అలంకార మొక్కలు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు. ఈ నర్సరీల ద్వారా అటవీ పునరుద్ధరణ కార్యక్రమాలకు అవసరమైన నాణ్యమైన మొక్కలను సరఫరా చేస్తున్నారు.శేషాచల అటవీ ప్రాంతంలో ఎన్నో వన్యప్రాణులు నివసిస్తున్నాయి. మానవ ? వన్యప్రాణి ఘర్షణలను తగ్గించేందుకు, గాయపడిన జంతువులను రక్షించేందుకు టీటీడీ అటవీ విభాగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వేసవి తీవ్రత దృష్టిలో ఉంచుకుని అటవీ ప్రాంతాల్లో జంతువుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక నీటి గుంతలు ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపుతున్నారు. తిరుమలలో దర్శన క్యూ లైన్ ప్రాంగణాల్లో మూడు స్నేక్ రెస్క్యూ బృందాలను నిరంతరం అప్రమత్తంగా ఉంటారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరమైన చెట్లను గుర్తించి తొలగించడం, గాలివానల కారణంగా పడిపోయిన చెట్లను తొలగించడం, రహదారుల పక్కన చెట్ల కొమ్మలను క్రమం తప్పకుండా తొలగిస్తున్నారరు.తిరుమల, టీటీడీ ఆలయ అవసరాల కోసం అవసరమైన శ్రీగంధం చెక్కలు, వంట చెరుకు, దర్భ గడ్డి, ఇతర పూజా సామగ్రిని టీటీడీ ఫారెస్ట్ విభాగం సమకూరుస్తోంది. తిరుమల, తిరుపతిలోని రహదారి డివైడర్లు, ఉద్యానవనాలు, పచ్చదన అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. మొత్తం 24 కిలోమీటర్ల మేర రహదారి డివైడర్లు, 25 ఉద్యానవనాలను సంరక్షిస్తోంది. వీటితో పాటుగా అరుదైన, ఔషధ గుణాలు ఉన్న వృక్ష జాతుల పరిరక్షణపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు.ఆయుర్వేద ఔషధాల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను కూడా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం పవిత్ర వనం, దివ్య ఔషధ వనం, పలమనేరు టింబర్ ప్లాంటేషన్, వన్యప్రాణి ఘర్షణల నివారణకు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యం.. కొండల పచ్చదనం పెంపు వంటి పలు కీలక ప్రాజెక్టులను టీటీడీ ఫారెస్ట్ విభాగం అమలు చేస్తోంది.

## జనగామ బతుకమ్మ కుంటను సందర్శించిన ఎమ్మెల్యే




జనగామ: డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం ఉదయం జనగామ పట్టణ కేంద్రంలోని ప్రముఖ బతుకమ్మ కుంట ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, యువకులు మార్నింగ్ వాక్‌కు వచ్చే ఈ ప్రాంగణంలో ఉన్న వసతులు, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ మార్నింగ్ వాక్ చేస్తున్న స్థానిక వాకర్స్‌తో కలిసి నడుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వాకర్స్ విజ్ఞప్తి: బతుకమ్మ కుంట ప్రాంగణంలో ఆధునిక ఓపెన్‌జిమ్ ఏర్పాటుచేయాలనివాకర్స్ ఎమ్మెల్యేను కోరారు. దీనివల్ల యువత, మహిళలు, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. అలాగే ప్రాంగణంలో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్‌కు ఫోన్‌లోనే ఎమ్మెల్యే ఆదేశాలు: వాకర్స్ తెలిపిన సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. బతుకమ్మ కుంట ప్రాంగణం నుంచే మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం బతుకమ్మ కుంట వద్ద అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, వాకర్స్ కోరినట్లుగా త్వరలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# భారీగా టూ ఇయర్స్ వేడుకలు

విజయవాడ,: ఏపీలో టీడీపీ కూటమి పాలనకు రెండేళ్లు పూర్తి కావొస్తోంది. జూన్ 12వ తేదీతో కూటమి పార్టీలు అధికార పగ్గాలు చేపట్టి రెండేళ్లు పూర్తి అయ్యి.. మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. జూన్ 12వ కొత్త వితంతు పింఛన్లు జారీ చేయనున్నట్లు మంత్రి ఆదివారం ప్రకటించారు. నెలకు రూ.4 వేలు చొప్పున వీరికి అందించనున్నారు.కొత్త పింఛన్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత వితంతు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించిన ఏపీ ప్రభుత్వం.. ఇందుకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జూన్ 12న వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడిన అచ్చెన్నాయుడు.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కానున్న నేపథ్యంలో జూన్ 12 నుంచి కొత్త వితంతు పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వితంతువుల పింఛన్ల కింద 1.53 లక్షల మంది వరకూ అర్హులుంటారని సెర్ప్ అంచనా వేస్తోంది. నెలకు రూ.4వేల చొప్పున లక్షా 53 వేల మందికి వితంతు పింఛన్లు అందించేందుకు సుమారుగా రూ.61 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక స్పౌజ్ పింఛన్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. స్పౌజ్ కేటగిరి కింద పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే.. అతని పింఛను మరుసటి నెలలోనే అతని భార్య పేరు మీదకు మార్చుతున్నారు. ఈ కేటగిరీ కింద ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 2.30 లక్షల మందికి కొత్త పింఛన్లు అందించారు.అయితే పింఛను అందని భర్త చనిపోతే పరిస్థితి వేరుగా ఉంది. చనిపోయిన వ్యక్తి భార్యకు వితంతు పింఛన్ అందించటంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జూన్ 12న అర్హులైన వితంతువులకు పింఛన్లు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. వితంతువుల తర్వాత అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. కొత్త దివ్యాంగ పింఛన్ల కోసం ఇప్పటికే చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులైన వారికి పింఛన్ అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### ట్రైన్ నుండి జారిపడి వ్యక్తి మృతి..

నెక్కొండ: గుర్తు తెలియని వ్యక్తి ట్రైన్ నుండి జారిపడి మరణించాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ-ఇంటికన్నె అప్ లైన్ మధ్య బుధవారం తెల్లవారుజామున వెళ్ళిన గుర్తు తెలియని రైలు నుండి జారిపడి మరణించినట్లుగా తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు, 5'6 ఎత్తు, ఎరుపు రంగు ఛాయ, కుడిచేతిపై 2 ా అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఐఆర్పీ అధికారుల ఉత్తర్వుల ప్రకారం హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9701747014, 8712658627 సంప్రదించవచ్చని తెలిపారు.

## పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పాల్వంచ : పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు ఫైళ్లు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రజలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలో భాగంగా స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఫిర్యాదులు స్వీకరించే సమయంలో బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా స్టేషన్ భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును ఎస్పీ పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. క్రమశిక్షణతో పనిచేస్తూ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు.

## హమాలి కార్మికులకు లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### సిపిఎం పార్టీ డిమాండ్



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం విలాసాగర్ గ్రామంలో సిపిఎం పార్టీ పక్షాన హ మాలీ కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా తెలుసుకోవడం జరిగింది. అసంఘటిత హ మాలి కార్మికులకు,మరి ఈరోజు ఏ లాంటి భద్రత లేకపోవడం, ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడం, అనారోగ్యం పాలైతే వారికి హెల్త్ కార్డులు లేకపోవడం, అలాగే 55 ,సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు పెన్షన్ లేకపోవడం, ఇలా అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్న కూడా మరి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను ఏమాత్రం కూడా వారి విషయంలో పట్టించుకున్న పరిస్థితి కనపడటం లేదు. మరి ఈరోజు మేము సిపిఎం పార్టీ గా డిమాండ్ చేస్తున్నాం. హ మాలి కార్మికులకు 55 ,సంవత్సరాలు పైబడిన కార్మికులకు 5000 ,రూపాయలు పెన్షన్ అందించాలి, 10 లక్షల, రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి, హెల్త్ కార్డులు అందించాలి, గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్నటువంటి హ మాలి కార్మికులను ప్రభుత్వ పరంగా గుర్తించి గుర్తింపు కార్డులు అందించాలి. తదితర డిమాండ్లను నెరవేర్చాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ డిమాండ్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో విలాసాగర్ హ మాలీ కార్మికులు, ఆకుల అంజయ్య, రమేష్, ఐలయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ లో,మాస్టర్స్ అథ్లెటిక్స్ లో వెలుగులీనుతున్న క్రీడాకుటుంబం







దేశానికి పల్లెలే పట్టు గొమ్మలనే నానుడి నేటి పోటీ ప్రపంచం లో క్రీడా రంగం లో మాత్రం పల్లె ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల పట్ల నిజం కాదేమోననిపిస్తోంది. నిజానికి క్రీడల్లో అత్యున్నత స్థాయిలో రాణించాలంటే శారీరక దారుఢ్యంతో పాటు, మానసిక పటుత్వాలు ఎంతో అవసరం. అవన్నీ సమృద్ధిగా ఉండి వాటికి తోడు గా ఆ రంగం లో అత్యున్నత స్థాయికి చేరుకోవాలనే దృఢమైన ఆకాంక్ష ఉన్నప్పటికీ పల్లెల్లో శిక్షణ కు అనువైన క్రీడా ప్రాంగణాలు లేక సుశిక్షితులైన శిక్షకులు లేక పట్టణాల కు వెళ్లే శక్తి లేక ఉన్నా వారిని చేరుకునే ఆర్థిక వనరులు లేక దేశం లో అనేక మంది గ్రామీణ ప్రాంతాల కు చెందిన ఔత్సాహిక క్రీడాకారులు జాతీయ ,అంతర్జాతీయ క్రీడా ప్రపంచం లోకి అడుగిడ లేక పోతున్నారు. ఫలితం గా నూట నలభై కోట్ల మంది జనాభా తో తుల తూగుతున్న మన దేశం లో అంతర్జాతీయ క్రీడా వేదిక లపై మన క్రీడా కారులు ఆశించిన స్థాయి లో క్రీడల్లో రాణించలేక పోతున్న వైనం బహిరంగ రహస్యమే. దేశం లో ఇట్లాంటి వ్యతిరేక పరిస్థితుల కు ఎదురీదుతూ ఇరవై ఏళ్ల క్రితమే కరీం నగర్ జిల్లా రామడుగు గ్రామానికి చెందిన నీలం లక్ష్మణ్ అనే రైతు బిడ్డ బాల్యం నుండి క్రీడ లపై మక్కువ తో , ఇంటర్ చదివే రోజుల్లోనే ఖో ఖో ,అథ్లెటిక్స్, రగ్బీ లాంటి క్రీడల లో జాతీయ స్థాయి పోటీల లో పాల్గొన్నాడు. ఆ విజయాల స్ఫూర్తి తో క్రీడల్లో మరింత గా రాణించాలనే పట్టుదల తో స్థానికం గా వ్యాయామ విద్యా సదుపాయాలు లేనందున తప్పని సరి పరిస్థితుల్లో బాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోసం హైదరాబాద్ మరియు మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోసం బెంగళూర్ కు వెల్లడం జరిగింది. తదనంతరం క్రీడల లో మరింత నైపుణ్యాన్ని సాధించడానికి నేషనల్ ఇన్వెస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ బొంబాయి లో స్పెషల్ ఫిట్ నెస్ కోర్స్ పూర్తి చేసి తనకు జీవనోపాధిని సమకూర్చే ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా ఓ వైపు వివిధ రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల లో పాలు పంచుకుంటూ తనను తాను విజేత గా ఆవిష్కరించుకుంటూ మరో వైపు వందల సంఖ్య లో క్రీడా కారులను తయారు చేయడానికి సిద్ధ పడ్డాడు. అంతే కాకుండా వందలకు పైగా రాష్ట్ర జాతీయ అథ్లెట్లను తయారుచేశారు. 2004లో ఢిల్లీలో జరిగిన రగ్బీ జాతీయ స్థాయిలో పాల్గొన్నాడు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ లో పతకాల పంట పండిస్తున్న నిత్య కృషీ వలుడు: 2008 నుండి 2023 వరకు మాస్టర్స్ అథ్లెటిక్స్ లో 100,200,400, 800మీ. లతో పాటు 100మీ మరియు 400మీ రిలేలలో పాల్గొని,దాదపు రాష్ట్రస్థాయిలో 72 పథకాలు, జాతీయ స్థాయిలో 24 పథకాలు,అంతర్జాతీయ స్థాయిలో 3 పథకాలు సాధించాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో కలిపి ఇప్పటి వరకు 400 పథకాలకు పైగా సాధించాడు.

రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో 1000 మంది క్రీడా కారుల నుండి 1600 మంది పాల్గొనే పోటీలలో ఒక్కరికి మాత్రమే ఇచ్చే ఉత్తమ అథ్లెట్ అవార్డును 10 సార్లు సాధించాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోన్ 6 సార్లు ఉత్తమ అథ్లెట్ అవార్డు తీసుకోవడం జరిగినది.

2010 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అథ్లెట్ గా గుర్తించి మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రం ఇచ్చింది.

జాతీయస్థాయిలో 2010 చెన్నైలో 100మీ ,200మీ ,100మీ రిలే సిల్వర్ మెడల్ రెండు బ్రాంజ్ మెడల్స్ ,2011 చండీఘర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో 400మీ రిలే బంగారు,400మీ ,సిల్వర్ 100మీ రిలే లో బ్రాంజ్ మెడల్స్ ,2014 రాజస్థాన్ లో 400మీ సిల్వర్,100మీ బ్రాంజ్,100మీ రిలే , 400మీ రిలే సిల్వర్ మెడల్స్,2015 హిమాచల్ ప్రదేశ్ ధర్మశాలలో 200మీ మరియు 400మీ సిల్వర్ మెడల్స్ 100మీ రిలే మరియు 400మీ రిలే బ్రాంజ్ మెడల్స్. 2018 ఢిల్లీలోని నెహ్రూ స్టేడియంలో 400మీ సిల్వర్, 800మీ మరియు 400మీ రిలే బ్రాంజ్ మెడల్స్ ఎం . 2019 జైపూర్ మాన్ సింగ్ స్టేడియంలో 400మీ రిలే సిల్వర్ , 400మీ , 800మీలలో బ్రాంజ్ మెడల్స్. 2020 హర్యానా దేవీలాల్ స్టేడియంలో 400మీ సిల్వర్, 800మీ బ్రాంజ్ మరియు 100మీ రిలే , 400మీ రిలే సిల్వర్ మెడల్స్

అంతర్జాతీయ స్థాయిలో 2010 మలేషియా కౌలలాంపూర్ లో 10కిమీ రన్నింగులో సిల్వర్ మెడల్ 100మీ నాలుగోవ స్థానం. 2015 సింగపూర్ లో 400మీ రిలే గోల్డ్ మెడల్ 400మీ బ్రాంజ్ మెడల్ సాధించారు.

జీవిత భాగస్వామి మాత్ర మే కాదు..క్రీడల్లోనూ భాగస్వామే!!: నీలం పద్మ ఇందిరానగర్ నుస్తులాపూర్ గ్రామం తిమ్మపూర్ మండలం కరీంనగర్ జిల్లాకు చెందిన కుంభం లింగమ్మ మల్లయ్య దంపతులకు జన్మించినది. హౌస్ వైఫ్ గా ఉంటూ భర్త లక్ష్మణ్ ప్రోత్సాహంతో 2014 సంవత్సరం నుండి 2025 వరకు మాస్టర్ అథ్లెటిక్స్ లో పాల్గొని రాష్ట్రస్థాయిలో 42 పతకాలు జాతీయ స్థాయిలో 16 పతకాలు, 4 సార్లు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. రెండు సార్లు రాష్ట్ర ఉత్తమ మహిళా అథ్లెట్ గా అవార్డ్ పొందింది.

2014 రాజస్థాన్ 100మీ సిల్వర్ 200మీ బ్రాంజ్, 100మీ రిలే,400మీ రిలే సిల్వర్ మెడల్స్ . 2015 హిమాచల్ ప్రదేశ్ ధర్మశాల 400మీ సిల్వర్, 200మీ సిల్వర్ ,400మీ రిలే సిల్వర్, 100మీ రిలే బ్రాంజ్ మెడల్స్, 2018 ఢిల్లీ నెహ్రూ స్టేడియం 100మీ గోల్డ్ ,200మీ సిల్వర్ 100మీ రిలే గోల్డ్ 400మీ సిల్వర్ మెడల్స్ .2019 జైపూర్ మాన్ సింగ్ స్టేడియం 100మీ రిలే గోల్డ్ 400మీ రిలే సిల్వర్ 100మీ బ్రాంజ్ మెడల్స్. 2020 హర్యానా దేవీలాల్ స్టేడియం 100మీ , 400మీ , 400మీ రిలే సిల్వర్ మెడల్స్ వంశోద్ధారకులే కాదు..క్రీడల్లో వారసు లు కూడా.... అమ్మా నాన్న ల వారసత్వం తో పాటు అథ్లెటిక్స్ లోనూ వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న నీలం దంపతుల పెద్ద కుమారుడు నీలం శివ రాకేష్ 2018 ఆంధ్రప్రదేశ్ గుంటూరులో జరిగిన యూనివర్సిటీ పోటీలలో శాతవాహన యూనివర్సిటీ తరుపున హ్యాండ్ బాల్ క్రీడలలో పాల్గొన్నాడు. 2019 కర్ణాటక లోని మంగుళూర్ అల్ ఇండియా క్రాస్ కంట్రీ రన్నింగ్ లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఆటలలో కాకుండా బి.పి. ఈడి ఉస్మానియా యూనివర్సిటీలో , ఎమ్.పి. ఈడి ఆంధ్రప్రదేశ్ కర్నూలు లోని రాయలసీమ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. చిన్న కుమారుడు శివ రాహుల్ . 2020 హైదరాబాద్ లో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో 200మీ, 400మీ లో ప్రథమ స్థానంలో నిలిచాడు అంతే కాకుండా అనేక రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నాడు. ఆటలతో పాటు చదువులోనూ ప్రతిభ కనబరిచి ఎంజిఐటి ఇంజనీరింగ్ కాలేజ్ హైదరాబాద్ లో సీటు సాధించి,ఇప్పుడు సిఎస్ఈలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు.

యువతకు క్రీడల తో ఉపాధిని కలిగించడానికి శాత వాహన పోలీస్ కోచింగ్ అకాడమి ఏర్పాటు...: తల్లిదండ్రులు ,పిల్లలు క్రీడల్లో దేదీప్యమానం గా వెలుగొంద తున్న నీలం కుటుంబం శారీరక, మానసిక దారుఢ్యానికి మేధస్సు ను జత చేస్తే వందల, వేల సంఖ్య లో పోలీసు మరియు మిలటరీ ఉద్యోగాలు సంపాదించవచ్చనే ఉద్దేశం తో 2010 వ సంవత్సరం లోనే కరీం నగర్ పట్టణం లో శాతవాహన పోలీస్ కోచింగ్ అకాడమి ని ఏర్పాటుచేసి నేటి వరకు 1600 మంది యువత ను పోలీసులు గా, యస్.ఐ లుగా ,మిలటరీ ఉద్యోగులు గా,రైల్వే పోలీస్ ఉద్యోగాలను సంపాదించడం లో తన వంతు పాత్ర ను పోషిస్తున్నది.



డాక్టర్ నీలం సంపత్
డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్స్ పాల్
మరియు సామాజిక కార్యకర్త
9866767471

## ప్రతి సమస్యను పరిష్కరిస్తాం..

# అభివృద్ధిలో ప్రతీకగా తీర్చిదిద్దుతాం

**బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల లో సుడిగాలి పర్యటన**

**త్వరలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**





పటాన్ చెరు, మే 20, (తెలంగాణ వాణి రిపోర్టర్): అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్దంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని తులసి వనం కాలనీ, భ్రమరాంబిక నగర్ కాలనీ, ఏ ఆర్ బృందావన్ కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీ, అంజనాద్రి కాలనీ, ట్రైలర్ కాలనీ, ఎన్ ఎస్ ఎల్ కాలనీ, ఎన్ బి ఆర్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీలలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. నేరుగా ప్రజలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, యూజిడీలు, విద్యుత్, తాగు నీరు తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో తనకు అందించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువుగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అమీన్పూర్ పరిధిలో దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టడంతో పాటు, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలకు సైతం అందించేందుకు ఇప్పటికే ప్రణాళికలు పూర్తయ్యాయని తెలిపారు. కాలనీలలో ప్రభుత్వ స్థలాలు పార్కులు కబ్జాలు గురికాకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య విషయంలో ప్రజలకు ఇబ్బందులకు తలెత్తకుండా నూతన సిబ్బందిని సైతం నియమిస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీలు ఏర్పడడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని.. ఇందుకు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లతో పాటు పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడటం తన నైజం అని, మిగతా సమయం ప్రజల అభివృద్ధి సంక్షేమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని.. అవసరమైన నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అతి త్వరలో బీరం గూడలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనన్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యేనే స్వయంగాతమ కాలనీలకు రావడం పట్ల ఆయా కాలనీల ప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు బాలరాజు, కృష్ణ, యూనుస్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్ డిఈ వెంకటరమణ, జలమండలి డిజిఎం శివకుమార్, విద్యుత్ శాఖ ఏడి సంజీవ్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో బావను హత్య చేసిన బావమరిది

వనస్థలిపురం : వనస్థలిపురం రైతు బజార్ సమీపంలోని డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయంలో బుధవారం దారుణ హత్య చోటు చేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో బావను బావమరిది హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బల పాండు అనే వ్యక్తి తన అక్కను ఆమె భర్త వెంకటేశ్ తరచూ వేధిస్తున్నాడనే ఆగ్రహంతో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. ఘటన అనంతరం నిందితుడు నేరుగా వనస్థలిపురం పోలీస్ స్టేషన్కు వెళ్లి లొంగిపోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబందించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రసాయన శాస్త్రంలో కేత స్వరూపకు పీహెచ్.డీ.



పటాన్ చెరు, మే 20, (తెలంగాణ వాణి రిపోర్టర్): హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కేత స్వరూప డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'చాల్కోన్ కలిపిన పిరిడిన్-పిరిమిడిన్, 1,2,4-ఆక్సాడయాజోల్ కలిపిన ఇండోలిజైన్-థయాడయాజోల్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ మూల్యాంకనం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ స్వరూప చేసిన డాక్టరల్ పరిశోధన, ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో, ఆశాజనకమైన వైద్యపరమైన అనువర్తనాలు కలిగిన నూతన రసాయన సమ్మేళనాల అభివృద్ధిపై దృష్టి సారిస్తుందన్నారు.

ఈ పరిశోధనలో భాగంగా, డాక్టర్ స్వరూప ఔషధ పరంగా ముఖ్యమైన రసాయన నిర్మాణాలను ఏకీకృతం చేయడం ద్వారా జీవశాస్త్ర పరంగా ప్రాముఖ్యత కలిగిన రెండు శ్రేణుల సమ్మేళనాలను రూపొందించి, సంశ్లేషించినట్టు తెలిపారు. సంశ్లేషించిన ఈ సమ్మేళనాలను ఎన్ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీతో సహా ప్రామాణిక విశ్లేషణాత్మక పద్ధతులను ఉపయోగించి నిర్మాణాత్మకంగా వర్గీకరించి, తదనంతరం వాటి జీవ క్రియాశీలతను మూల్యాంకనం చేశారన్నారు. అనేక సమ్మేళనాలు ప్రోత్సాహకరమైన ఫలితాలను కనబరిచాయని, భవిష్యత్తు ఔషధ అభివృద్ధికి వాటి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయని వివరించారు. ఈ అధ్యయనం ఔషధ రసాయన శాస్త్ర రంగానికి విలువైన అంతర్దృష్టులను అందిస్తుందని, క్యాన్సర్ చికిత్స కోసం సమర్థవంతమైన చికిత్సా ఏజెంట్ల అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుందన్నారు. డాక్టర్ స్వరూప సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0



రాయికల్:మే 20(తెలంగాణ వాణి): రాయికల్ పట్టణంలో బుధవారం రోజున అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా 15 కోట్ల 20 లక్షలతో మంచి నీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేసి,3 కోట్ల14 లక్షలతో రాయికల్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులకు జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయికల్ పట్టణ ప్రజల తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి నీటి సరఫరా పైప్ లైన్ మరియు ట్యాంక్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని,ప్రజల డబ్బు ప్రజలకు అవసరమైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడమే నిజమైన ప్రజాప్రతినిధుల పని అని, 16 లక్షల లీటర్ల ట్యాంకు నిర్మాణంతో రాయికల్ పట్టణ దాదాపు 20 వేల మంది ప్రజల తాగునీటి ఇబ్బంది తీరుతుందని,గతంలో తొమ్మ్బ్రరావు పెట్ వద్ద తూము పెట్టడం వల్ల రాయికల చర్ల కొండాపూర్ నుండి బోర్నపల్లి వరకు వేసవిలో నీటి కరువు తీర్చడం జరిగింది. చెక్ డ్యామ్ లు నిర్మించడం జరిగిందని,పట్టణంలో నీటి పైపు లైన్ వేసినప్పుడు అనేక సమస్యలు తలెత్తుతాయి అని వాటి పరిష్కారానికి అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. రాయికల్ పట్టణ అభివృద్ధి కి కృషి చేస్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి,ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,కమిషనర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో చిరంజీవి,ఎమ్మార్వో నాగార్జున మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు,మాజీ వైస్ చైర్మన్ రమాదేవి అచ్యుతరావు,కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్,మచ్చ లక్ష్మి (శేఖర్),రాకేష్ నాయక్, లతికఅనిల్,శ్రీధర్,చిన్న ధర్మపురి, మానస భూమేష్, నాగరాజు, నాయకులు కోల శ్రీనివాస్,రవీందర్ రావు,పడిగేల రవీందర్ రెడ్డి,మహేంద్ర బాబు,జక్కుల స్వామి,భీమయ్య,శివ బొద్దుల,పట్టణ మండల నాయకులు,సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు .

# అదృశ్యమైన యువకుడు.. యువతి తల్లిదండ్రుల చేతిలో హతం

అమరావతి : మార్కాపురం జిల్లాలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన సంచలనం కలిగిస్తుంది. కుమార్తెతో సన్నిహితంగా ఉండడాన్ని భరించలేక ఆమె తల్లిదండ్రులు యువకుడిని దారుణంగా చంపి వేశారు. ఈనెల 13న యర్రగొండపాలెంకు చెందిన ఆంజనేయులు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా యువతి తల్లిదండ్రులు వెంకట నారాయణ, రమణ దంపతులను అదుపులోకి తీసుకుని విచారించగా ఆంజనేయులును చంపినట్లు గుర్తించారు. యువకుడిని చంపి మృతదేహాన్ని కత్తితో ముక్కలు ముక్కలుగా నరికి బోరు బావిలో పడేసినట్లు విచారణలో అంగీకరించారు. దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# 6 నెలలు పాడవకుండా ఉండే రొట్టె..!

## ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఫుడ్ సీక్రెట్



లవాష్ రొట్టె కాగితంలా పలుచగా ఉండే ఈ రొట్టె కేవలం ఒక ఆహార పదార్థం మాత్రమే కాదు.. ఆ దేశ సంస్కృతి ఇంకా సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీకగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఆహార ప్రియులను ఆకట్టుకున్న ఈ రొట్టెకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కూడా దక్కింది. అత్యంత సులభమైన తయారీ విధానం కలిగి ఉండి నెలల తరబడి తాజాగా ఉండే ఈ రొట్టె విశేషాలను ఇప్పుడు వివరంగా పరిశీలిద్దాం.

యునెస్కో గుర్తింపు: అర్మేనియన్ లవాష్ రొట్టెకు ఉన్న ప్రత్యేకతను గుర్తించిన యునెస్కో.. దీనిని 2014లో మానవాళి యొక్క అమూర్త సాంస్కృతిక వారసత్వం జాబితాలో చేర్చింది. దీని తయారీలో పాటించే విభిన్నమైన పద్ధతులు ఇంకా ఆ దేశ సామాజిక జీవితంలో దీనికి ఉన్న ప్రాముఖ్యత ఈ గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. అర్మేనియాలో లవాష్ తయారీని ఒక వ్యక్తి చేసే పనిగా కాకుండా ఒక కుటుంబ వేడుకగా భావిస్తారు. ఇంటి సభ్యులందరూ కలిసి ఈ రొట్టెలను తయారు చేయడం ద్వారా వారి మధ్య బంధాలు మరింత బలపడతాయని అక్కడి ప్రజలు గట్టిగా నమ్ముతారు. దీని తయారీకి కేవలం గోధుమ పిండి, నీరు ఇంకా ఉప్పు మాత్రమే ఉపయోగిస్తారు. ఇందులో ఈస్ట్ వాడకపోవడం వల్ల ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

టోనిర్ మట్టి పొయ్యిలో: లవాష్ తయారీ విధానం చూడటానికి చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ముందుగా కలిపిన పిండిని చాలా పలుచగా చపాతీలా ఒత్తుతారు. తర్వాత దానిని ఒక ప్రత్యేకమైన గుడ్డ కుషన్‌పై పరచి 'టోనిర్' అనే సాంప్రదాయ మట్టి పొయ్యి వేడి గోడలపై అతికిస్తారు. ఆ వేడికి కేవలం 30 సెకన్ల నుండి ఒక నిమిషంలోనే ఈరొట్టె పూర్తిగా సిద్ధమవుతుంది. తాజాగా ఉన్నప్పుడు ఇది చాలా మృదువుగా ఉంటుంది. దీనిని చీజ్ లేదా కబాబ్‌లతో కలిపి రోల్ లా చుట్టి తింటారు.అయితే దీనిని ఎక్కువ కాలంనిల్వఉంచాలనుకున్నప్పుడు పూర్తిగా ఎండబెడతారు. ఇలా ఎండిన రొట్టె ఆరు నెలల వరకు పాడవకుండా ఉంటుంది. మళ్ళీ తినాలనుకున్నప్పుడు దానిపై కొద్దిగా నీళ్లు చల్లితే చాలు.. అది తిరిగి తన పూర్వపు మృదుత్వాన్ని సంతరించుకుంటుంది. అర్మేనియన్ సంప్రదాయంలో లవాష్‌కు ఎంతో పవిత్రమైన స్థానం ఉంది. పెళ్లి సమయంలో నూతన వధూవరుల భుజాలపై ఈ రొట్టెను ఉంచుతారు. ఇలా చేయడం వల్ల వారి జీవితాల్లో ఆనందం ఇంకా ఐశ్వర్యం వెల్లివిరుస్తాయని వారి నమ్మకం. ప్రాచీనకాలంలో లవాష్ ఎక్కువ కాలంనిల్వ ఉండేకారణంగా సైనికులు యుద్ధాలకు వెళ్లేటప్పుడు దీనిని వెంట తీసుకెళ్లేవారు. దీర్ఘకాల ప్రయాణాల్లో ఆకలి తీర్చడానికి ఇది ఎంతో ఉపయోగపడేది. నేటి కాలంలో కూడా తన ఆరోగ్యకరమైన లక్షణాల వల్ల ఈ రొట్టె అనేక దేశాల్లో ప్రాచుర్యంపొందుతోంది. కేవలం మూడు పదార్థాలతో నెలల తరబడి నిల్వ ఉండే ఆహారాన్ని తయారు చేయడం అనేది నిజంగా ఒక అద్భుతమైన కళ. సాధారణ పదార్థాలతో తయారయ్యే ఈ లవాష్ రొట్టె మన పూర్వీకుల ఆహార భద్రతపై ఉన్న అవగాహనకు ఒక ఉదాహరణ. ఒకసారి తయారు చేసినెలల తరబడివాడుకోవచ్చనే సౌలభ్యంవల్లఇది ఆధునిక కాలంలోకూడా అద్భుతమైన ఆహారంగా గుర్తింపు పొందుతోంది.సంప్రదాయం ఇంకాఆరోగ్యం కలగలిసినఈ అర్మేనియన్ రొట్టె గురించి మీరు ఏమనుకుంటున్నారో మాతో పంచుకోండి!

## వ్యవసాయ వ్యర్థాలకు నిప్పు.. లోతు వాగులో ఇల్లు దగ్ధం



లక్ష్మీదేవిపల్లి, మే 20 : లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతు వాగులో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ. 5లక్షలకు పైగా నష్టం వాటినట్లుసమాచారం. లోతు వాగు గ్రామ పంచాయతీ మాదిగ ప్రోలులో స్థానిక రైతు తన పొలంలోని వ్యర్థాలకు నిప్పు పెట్టగా నిప్పు రవ్వలు ఎగిరి వచ్చి అశోక్ నగర్ గ్రామ పంచాయతీ వర్కర్ గా పని చేస్తున్న పాయం సతీశ్ ఇంటిపై పడడంతో ఇల్లు మొత్తం కాలిపోయింది. 100 బస్తాల ధాన్యం, మూడు వ్యవసాయం మోటర్లు,ఒక గ్లామర్ బైక్, ఇంట్లోని వస్త్రాలు సామన్లు మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న లోతువాగు సర్పంచ్, ఉప సర్పంచ్ వెంటనే అక్కడికి చేరుకుని చుట్టుపక్కల నివాసా లకు మంటలు వ్యాప్తి చెందకుండా పంచాయితీ ట్యాంకర్ తో నీటిని కొట్టి మంటలను అదుపు చేశారు.ఈ ఘటనపైసర్పంచ్ ఈసం కళ్యాణి లక్ష్మీదేవిపల్లి తాసీల్దార్, ఎస్ఐకు సమాచారం అందించి బాధితులకు ప్రభుత్వ నుండి సహాయం అందే విధంగా చూడాలని కోరారు.

# అమీర్ పేట జంక్షన్ లో ఎన్టీఆర్ విగ్రహం..

హైదరాబాద్,: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా తాను మాట ఇచ్చినట్లు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే అమీర్ పేట చౌరస్తాలో తెలుగువారి అన్న ఎన్టీఆర్ విగ్రహం ప్రతిష్టించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరులు, ఎన్టీఆర్ అభిమానుల ఓట్లే టార్గెట్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. తెలంగాణ గడ్డపై టీడీపీ అనుకూల వ్యాఖ్యలు చేస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందనే అనుమానాలను పటాపంచలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. అమీర్‌పేట్ లోనే కాకుండా, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' వంద అడుగుల విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, దివంగత నేత నందమూరి తారక రామారావు అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఒక ఎమోషన్. పార్టీలకు అతీతంగా అన్నగారిని ఆరాధించే కోట్లాది మంది అభిమానులు రెండు రాష్ట్రాల్లో ఉన్నారు. ఎన్టీఆర్ అభిమానులు ఎక్కువగా ఆయన స్థాపించిన టీడీపీకి అనుకూలంగా ఉంటారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత టీడీపీ ఉనికి కోల్పోగా, ఆ పార్టీ సానుభూతిపరులు, అభిమానులు మాత్రం తరచూ తమ ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో భారీగా ఉండే టీడీపీ సానుభూతిపరులను ఆకర్షించడానికి తెలంగాణ పార్టీలు విస్తృతంగా ప్రయత్నిస్తుంటాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ విషయమై పెద్ద డిబేట్ కూడా కొనసాగింది. ఆ సమయంలో కీలకమైన టీడీపీ సానుభూతిపరుల ఓటర్లను కైవసం చేసుకోడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అమీర్‌పేట్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇక ఎన్నికల ప్రచార సమయంలో అమీర్‌పేట్ జంక్షన్ వద్ద సీనియర్ ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులు తాజాగా ప్రారంభించారు. ప్రస్తుతం పునాది పనులను ప్రారంభించారని ఇది పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అవిష్కరిస్తారని అంటున్నారు. హైదరాబాద్‌లో అమీర్‌పేట్, మైత్రీవనం ప్రాంతాలంటే నిత్యం లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలతో కిటకిటలాడే అత్యంత కీలకమైన జంక్షన్లు. అలాంటి చోట ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక రాజకీయ అడుగులు ఉన్నాయనే చర్చ నడుస్తోంది.తెలుగుదేశం పార్టీ నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆ పార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రణాళికలో భాగంగా పకడ్బందీగా వ్యూహం రచిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ తిరిగి బలపడటం సాధ్యం కాదని, టీడీపీ ఓటర్లు తన నాయకత్వం కిందకు రావాలని బలమైన సంకేతాలు పంపేలా సీఎంరేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. ఈ వ్యూహం అమలులో భాగంగా అమీర్‌పేట్ లో విగ్రహం ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయని, మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' ప్రతిపాదించిన 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కూడా సానుకూల నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

# మీ స్పందనే ... ఓ ప్రాణం..!



**వెంటిలేటర్‌పై కేశవపట్నం వాసి శ్రీనివాస్**

**రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు**

**హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స**

**పరిస్థితి విషమం.. రోజుకు లక్షల్లో ఖర్చు**

**దాతల సాయం కోసం పేద కుటుంబం ఎదురుచూపు**

శంకరపట్నం మే 20 (తెలంగాణ వాణి): నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి కుటుంబాన్ని పోషించుకుం టున్న ఓ యువకుడిపై విధి కన్నెర్రజేసింది.రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు.చికిత్స ఖర్చులు లక్షల్లో పెరుగుతుండ గా,ఆ కుటుంబం చేతిలో చిల్లిగవ్వ లేక దాతల సహాయం కోసం వేడుకుంటోంది. వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన సామల శ్రీనివాస్ (భార్య సుప్రియ) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు.వీరికి ఐదేళ్ల కుమార్తె,9 నెలల కుమారుడు ఉన్నారు.ఈ నెల 13న విధులు ముగించుకుని రాత్రి బైక్‌పై ఇంటికి వస్తున్న సమయంలో శంకరపట్నం మండలం ఎరడపల్లి --తాడికల్ మార్గంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు కనిపించక బైక్ అదుపు తప్పి పడిపోయాడు.ఈ ప్రమాదం లో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి అంబులె న్స్‌లో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.అ క్కడ చికిత్స అందించినప్ప టికీ మరుసటి రోజు పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చిన్న మెదడుకు సంబంధించిన నరాలు దెబ్బతిన్నాయని, పరిస్థితి అత్యంత సీరియస్‌గా ఉందని తెలిపారు.ప్రస్తుతం కదలికలు లేక వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనతో శ్రీనివాస్ తల్లిదండ్రులు గౌరవ్వ – మధునయ్య,భార్య సుప్రియ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.చికిత్సకు రోజురోజుకు ఖర్చు పెరుగుతుండటంతో ఆ కుటుంబం దాతల సహాయం కోసం ఆశగా ఎదురు చూస్తోంది.శ్రీనివాస్ ప్రాణాపా య స్థితిలో చికిత్స పొందు తున్న నేపథ్యంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు,ప్రజాప్రతి నిధులు మానవతా దృక్పథం తో ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం ద్వారా అతడి ప్రాణాన్ని నిలబెట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సాయం అందించాల్సిన ఖాతా వివరాలు:

Name: Porandla Supriya
A/c No. 62324674552
IFSC Code - SBIN0020136
Branch: Jammikunta
PhonePe, Google Pay:
9000747938.

# కస్తూరిబా టీచర్లకు భద్రత ఏదీ?



రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని 352 కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో ( కె.జి.బి.వి) 4700 మంది టీచర్లు పని చేస్తున్నారు. సమాజంలో ఒంటరి తల్లిదండ్రుల పిల్లలను, మధ్యలో బడి మానివేసిన పిల్లలను ఎదుట వేసుకుని వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న కె.జి.బి.వి ప్రిన్సిపాళ్లు, సి.ఆర్.టి.లకు, మిగిలిన సిబ్బందికి ఎటువంటి భద్రత లేకపోవడం, ప్రభుత్వాలు ఎటువంటి భరోసా కల్పించక పోవడంతో నిరంతర మానసిక వేదనను అనుభవిస్తున్నారు. అన్ని అర్హతలు కలిగి, ప్రత్యేక రాత పరీక్షల ద్వారా ఎంపికై, బోధన చేస్తున్న సిఆర్టిలు అన్నింటా వివక్షతకు గురవుతూ వెట్టిచాకిరి చేస్తున్నారు. కాంట్రాక్టు విధానంలో నియమించడమే దీనికి ప్రధాన కారణం. వీరికి వేతనాలు పెంచరు. ఉద్యోగ భద్రత ఉండదు. పని గంటలు, పని భారం ఎక్కువ. ఏ సంక్షేమ పథకాలు వర్తించవు. ఇచ్చే వేతనాల్లో సిబ్బంది మధ్య వ్యత్యాసాలు. డ్రాపొట్ల సేకరణకయ్యే ఖర్చులు ఏళ్లు తరబడి ఇవ్వరు. పైగా పర్ఫార్మెన్స్ ఫారాలు ఇచ్చి ఎప్పుడైనా, ఎటువంటి చర్యలైనా తీసుకుంటామని హెచ్చరికలు. సంఘటనలు జరిగిన సందర్భంలో సమగ్ర దర్యాప్తులు ఉండవు. పి.ఎఫ్, హెల్త్ కార్డులు వంటివి వర్తించవు. టెర్మినేషన్లు అతి సులభంగా చేస్తారు. వీరికి ఒక్క సంక్షేమ పథకం వర్తించదు. ధరల పెరుగుదల, అనారోగ్య సమస్యలు, పిల్లల చదువులు, వయసు పైబడటం జీవన విధానానికి సవాల్‌గా ఉన్నాయి. గ్రాట్యుటీలు గానీ, పెన్షన్లు గానీ, హెల్త్ కార్డులు గానీ, కనీసం అప్పు కోసం బ్యాంకులకు వెళ్లిన రుణాలు ఇవ్వరు. 2017 నుండి ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేయడం లేదు. కోర్టు తీర్పులను అమలు చేయకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారు? ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు చెప్పిన మాట వినకపోతే కోపం వస్తే వారిని తొలగిస్తారు లేదా తీసేస్తారు. నోటిఫికేషన్లు లేకుండా ఏ రిక్రూట్మెంట్ ప్రక్రియలు చేపట్టకూడదని రాజ్యాంగంలో ఉన్నప్పటికీ అమలు చేయరు. వేతనాల్లో అసమానతలు తొలగించాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. మినిమమ్ టైం స్కేలు అమలు చేయమని ఇచ్చిన జి.ఓ.లను అమలు చేయలేదు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఎం.టి.ఎస్ జి.ఓ.లను ఎందుకు అమలు చేయడం లేదని అడిగింది. దీనికి సంబంధించి ఎటువంటి చర్యలు లేవు. కె.జి.బి.వి పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్టిలను శాశ్వత ఉద్యోగులుగా ఎందుకు పరిగణించకూడదో చెప్పాలని కోర్టు అడిగింది. చాలా రాష్ట్రాలలో ఈ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. దీనికి ప్రాజెక్టు అనేది ఆటంకం కాదని ఆయా రాష్ట్రాలు నిరూపించాయి. కనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 352 కె.జి.బి.వి పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్టిలు, పిఇటిలు, ప్రిన్సిపాళ్లు, నైట్ వాచ్మెన్లు...అందరినీ రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. మినిమమ్ టైం స్కేలు అమలు చేయాలి. ఇన్సూరెన్స్‌లు, పి.ఎఫ్.లు, హెల్త్ కార్డులు అమలు చేయాలి.

## రైతు నష్టపోతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు

### మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి

సంగారెడ్డి : రైతు ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి నిలిపివేయడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా శంకరంపేట (ఎ) మండలంలోని జుక్కల్, వీరోజీపల్లి గ్రామాలలో ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాలను మహారెడ్డి భూపాల్ రెడ్డి సందర్శించారు. అక్కడ రైతులు ఎదుర్కొంటున్నసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రోజులు గడుస్తున్నా వడ్లు కొనుగోలు కాకపోవడం, తూకాలు ఆలస్యం కావడం, సరిపడా సిబ్బంది లేక రైతులు గంటల తరబడి వేచి ఉండటంతో తాము తీవ్ర ఆందోళనలో ఉన్నామని రైతులు మహారెడ్డి భూపాల్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి ఫోన్ చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తీసుకొచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహారెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి. రైతు నష్టపోతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. రైతులకు ఎప్పుడూ మేము అండగా ఉంటామని అన్నారు.

# వంట నూనెలపై భారం తప్పదా..



న్యూఢిల్లీ, : ప్రజలకు ధరల పోటు తప్పేలా లేదు. వంట నూనెల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం కేంద్రం తీసుకోబోయే నిర్ణయమే.స్థానిక రైతులకు మద్దతివ్వడం, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడం కోసం వంట నూనెలపై దిగుమతి సుంకాలను పెంచే ప్రతిపాదనను భారత ప్రభుత్వం పరిశీలిస్తోంది. వంట నూనెలపై అధిక దిగుమతి పన్నులు.. రైతులు తమ పంటలకు మెరుగైన ధరలు పొందేందుకు సాయపడతాయా, అలాగే భారీ సరుకుల దిగుమతులతో ముడిపడి ఉన్న విదేశీ మారక ద్రవ్య ప్రవాహాలను అరికట్టగలవా అనే విషయాన్ని అధికారులు సీరియస్‌గా పరిశీలిస్తున్నారు.ఈ ఏడాది ఆసియాలో రూపాయి అత్యంత బలహీనమైన కరెన్సీగా కొనసాగుతోంది. వంట నూనెలు, ఎరువులు, బంగారం, ముడి చమురు వంటి దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న తరుణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వంట నూనెతో సహా దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని రేంద్ర మోదీ దేశ ప్రజలను కోరారు. అంతేకాదు అనవసరమైన దిగుమతులను అరికట్టేందుకు గత వారం బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.భారతదేశం తన వంట నూనె అవసరాలలో దాదాపు 60% దిగుమతి చేసుకుంటుంది. తద్వారా ప్రపంచంలోనే వంట నూనెల అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. దిగుమతి సుంకాలలో ఏ పెరుగుదల అయినా ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, యుక్రెయిన్ నుండి దిగుమతి అయ్యే పామాయిల్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెల రవాణాను ప్రభావితం చేయొచ్చు.ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు వేగంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన కూడా వచ్చింది. ఇరాన్ సంఘర్షణ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించి వంట నూనెలు, ధాన్యాలు, మాంసం ఉత్పత్తుల ధరలను పెంచింది.ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే వంట నూనె అయిన పామాయిల్.. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి సుమారు 12% పెరిగింది. పెరుగుతున్న ఇంధన వ్యయాలను భర్తీ చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఇండోనేషియా, మలేషియాలో బయోఫ్యూయల్ ఉత్పత్తి పెరగడం కూడా ఈ పెరుగుదలకు పాక్షికంగా కారణమైంది. అయితే, దిగుమతి సుంకాలను పెంచడానికి భారత్ తీసుకోబోయే చర్య కొనుగోళ్లను నెమ్మదింపజేసి, ఇటీవలి ధరల పెరుగుదలను అదుపు చేయగలదు.

కాగా, దిగుమతి సుంకాల పెంపుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. దేశీయ ధరలను తగ్గించి, ప్రాసెసర్లకు ఉపశమనం కల్పించే ప్రయత్నంలో భాగంగా గత సంవత్సరం ముడి పామ్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 20% నుండి 10%కి తగ్గించింది కేంద్రం. సుంకం తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని పరిశ్రమను కోరింది ప్రభుత్వం.ఇదిలా ఉండగా, పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడి కారణంగా భారత రూపాయి మరింత బలహీనపడి, సోమవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.35 వద్ద రికార్డ్ కనిష్ట స్థాయికి పడిపోయింది.

## జొన్న పంటను కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

బజార్ హత్నూర్ : ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంలో జొన్న పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జొన్న కొనుగోలు చేసి వారం గడిచినా కూడా లోడింగ్ చేయకపోవడంతో వర్షానికి 7వలే మొక్కజొన్న సంచులు తడిసిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జొన్న పంట ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు దుబ్బుల చంద్రశేఖర్, దంగరి రాములు, ప్రభాకర్, తోకల రాజన్న, అనుము సాయన్న, అగ్గునందు ధనుంజయ్, ఫరీద్ ఖాన్, లక్కం శంకర్, సోం రామ్ రెడ్డి, లక్కం శ్రీనివాస్, గంట చిన్నయ్య, మారుతి, తడక శ్రీనివాస్, దన్నగర్ పండరి, సుది వినాయక్, తదితరులు పాల్గొన్నారు.

# స్పిరిట్‌లో సైలెంట్ వార్?



దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ నిర్మాణం జరుపుకుంటున్న పానిండియా చిత్రాల్లో ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రెస్టేజియస్ మూవీ కోసం అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పూర్తి కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ చూడనటువంటి రూత్‌లెస్ పోలీస్ అవతారంలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన ఎపిసోడ్‌ని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్నట్లు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ఎపిసోడ్‌లో యాక్షన్ కంటే సైలెన్స్‌తోనే సందీప్ భయపెట్టనున్నారట. ఆద్యంతం సీరియస్ డ్రామాగా ఈ సీక్వెన్స్ సాగుతుందని వినికిడి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నడిచే వార్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుందట. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న గ్రాండ్‌గా విడుదల కానున్నది.

# ఇక తమిళం వంతు!



దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం 'దేవర'తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి 'పెద్ది' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు. ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం. కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. 'పెద్ది'లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.

## హ్యాపీ బర్త్‌డే బావ.. ఈసారి టైగర్ కాదు డ్రాగన్: అల్లు అర్జున్



టాలీవుడ్ స్టార్ హీరో, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

ముఖ్యంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సీనియర్ నటి ఖుష్బూ చెప్పిన విషెస్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ఎన్టీఆర్‌కు అల్లు అర్జున్ చాలా ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలిపారు.

"హ్యాపీ బర్త్‌డే బావా.. ఈసారి వచ్చేది టైగర్ కాదు.. డ్రాగన్. ప్రతి షాట్‌లోనూ నిప్పులు చెరిగావ్" అంటూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. ఎన్టీఆర్ రాబోయే చిత్రం 'డ్రాగన్' గ్లింప్స్‌ను ప్రశంసిస్తూ బన్నీ చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. మరోవైపు సీనియర్ నటి ఖుష్బూ కూడా తారక్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

"నా ప్రియమైన, నాకు అత్యంత ఇష్టమైన తారక్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు. మీకు సంతోషం, విజయం, మంచి ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నాను. ఆ దేవుడు మిమ్మల్ని ఎల్లప్పుడూ ఆశీర్వదించుగాక. లవ్ యూ కన్నా!! నా హీరో, నా తారక్, నా డ్రాగన్" అంటూ ఆమె భావోద్వేగంగా ట్వీట్ చేశారు.

# సినిమా

## విడుదలైన 12 రోజులకే ఓటీటీలోకి.. లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి'!




మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల వివాహం తర్వాత వెండితెరపై నటించిన సరికొత్త రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం సతీ లీలావతి. మలయాళ నటుడు దేవ్ మోహన్ హీరోగా, 'భీమిలి కబడ్డీ జట్టు', వంటి చిత్రాల ఫేమ్ డైరెక్టర్ తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో, థియేట్రికల్ రన్ చాలా త్వరగానే ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఎవరూ ఊహించని విధంగా కేవలం 12 రోజుల వ్యవధిలోనే ఈ సినిమాను ఓటీటీ వేదికగా డిజిటల్ స్ట్రీమింగ్‌లోకి తీసుకువచ్చింది. మెగా ఫ్యామిలీకి చెందిన ఒక నటి నటించిన సినిమా ఇంత తక్కువ సమయంలో ఓటీటీ బాట పట్టడం టాలీవుడ్‌లో ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు 'సన్ నెక్ట్స్' తో పాటు జియో హాట్‌స్టార్‌లు ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా, నేటి (మే 20) నుంచే తెలుగుతో పాటు తమిళ భాషల్లోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే కథలో లీలావతి (లావణ్య త్రిపాఠి) ఒక స్టార్ డైరెక్టర్. చిన్నతనం నుంచి తల్లిదండ్రుల గొడవల వల్ల కొన్ని మానసిక భయాలతో పెరుగుతున్న ఆమెకు సైకాలజిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) అండగా నిలబడి ఆ భయాల నుండి బయటపడేస్తాడు. ఈ క్రమంలోనే ఇద్దరూ ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటారు. అయితే పెళ్లైన మూడేళ్ల తర్వాత, తాను వేరే అమ్మాయి (మడోన్నా సెబాస్టియన్)తో ప్రేమలో ఉన్నానని, తనకు విడాకులు కావాలని రామ్ సేతు భార్యను కోరతాడు. దీంతో షాక్‌కు గురైన లీలావతి భర్తను ఇంట్లోనే బంధిస్తుంది. ఆ తర్వాత వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయి, అసలు సేతు బ్యాక్‌గ్రౌండ్ ఏంటి, చివరికి ఈ జంట ఎలా ఒకటయ్యారు అనేదే ఈ సినిమా ముఖ్య కథాంశం. వివాహ బంధంలో ఉండే లోపాలను, సమస్యలను కామెడీ టచ్‌తో చూపించిన ఈ చిత్రం థియేటర్లలో మిస్ అయిన హోమ్ ఆడియన్స్‌కు ఓటీటీలో మంచి వినోదాన్ని అందిస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. ఈ చిత్రంలో నరేశ్ వికె, మడోన్నా సెబాస్టియన్, వీటీవీ గణేశ్, సప్తగిరి, మొట్టా రాజేంద్రన్ వంటి ప్రముఖ నటీనటులు ఇతర కీలక పాత్రల్లో నటించగా, మెలోడీ బ్రహ్మ మిక్కీ జే మేయర్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై ఎం. నాగ మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు.

# 'డ్రాగన్'లో 'లూగర్'గా ఎన్టీఆర్..




యంగ్ టైగర్ ఎన్టీఆర్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ పాత్ర పేరును 'లూగర్'గా పరిచయం చేయడం అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో హీరోల పేర్లను శక్తివంతంగా తీర్చిదిద్దుతారన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో రాకీ, 'సలార్'లో దేవా మాదిరిగానే 'డ్రాగన్'లో ఎన్టీఆర్ పాత్రకు 'లూగర్' అనే పేరు పెట్టడం వెనుక ప్రత్యేక కారణం ఉన్నట్టు తెలుస్తోంది. 'లూగర్' అనేది ప్రపంచ యుద్ధాల కాలంలో జర్మనీ సైన్యం వాడిన ఒక క్లాసిక్ పిస్టల్. అత్యంత కచ్చితమైన లక్ష్యానికి, ప్రాణాంతకమైన వేగానికి ఇది ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో సినిమాలో ఎన్టీఆర్ పాత్ర కేవలం ఒక వ్యక్తిలా కాకుండా, శత్రువులను వేటాడే ఆయుధంలా ఉండబోతోందని ఈ పేరు సూచిస్తోంది. కాగా, ఈ విషయంపై చిత్రబృందం ఇంకా స్పందించలేదు. అయితే, 'లూగర్' అనే పదానికి గూగుల్, వీకిపిడియాలో మాత్రం ఈ అర్థం కనిపిస్తుంది. ఈ చిత్రం 1967 కాలం నాటి అంతర్జాతీయ ఓపియం (నల్లమందు) స్మగ్లింగ్ మాఫియా నేపథ్యంలో సాగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. బ్రిటిష్ వారు దేశం విడిచి వెళ్లాక, ఓపియం వ్యాపారం 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ', 'గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ'లుగా విడిపోతుంది. ఈ రెండు కంపెనీల మధ్య ఆధిపత్య పోరు, రక్తపాతం చుట్టూ కథ నడుస్తుంది. ఇందులో ఎన్టీఆర్ 'ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ'కి చెందిన 'అసాసిన్-ఇన్-చీఫ్'గా కనిపించనున్నారు.

ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత కథానాయికగా నటిస్తుండగా, నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్' అనే కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది.



# బండి భగీరధ్ కేసులో.. క్రెడిట్ వార్



హైదరాబాద్, : బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ కేసు కేవలం చట్టపరమైన పరిధిని దాటిపోయి రాజకీయంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ ను ఒకే గాటన కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరో వైపు అధికార కాంగ్రెస్ , బీజేపీ మధ్య ఒక హై-వోల్టేజ్ మైండ్ గేమ్ కు వేదికైంది. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బండి భగీరథ్ కేసు చుట్టూ తిరుగుతున్నాయి. బీజేపీ దశ మారుస్తారని భావిస్తున్న కీలక నేత కుమారుడు కావడం.. భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం, ఆయన లొంగిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచాయి. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్ ఒక బలమైన రాజకీయ ఆయుధంగా మలచుకుంటుండగా, బీజేపీ దీనిని హనీ ట్రాప్‌గా అభివర్ణిస్తూ ఎదురుదాడికి దిగుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉంటే.. కేసును ప్రభావితం చేస్తారని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేసు నమోదైన నాటి నుంచే దర్యాప్తులో ఎందుకు జాప్యం జరుగుతోందని డీజీపీని ప్రశ్నించడం ద్వారా, తన ప్రభుత్వం చట్టం అమలులో ఎవరికీ మినహాయింపు ఇవ్వదని గట్టి సందేశం పంపారు. కేంద్ర మంత్రి కుమారుడైనా సరే వదిలేది లేదని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మహిళల భద్రత, పోక్సో కేసుల తీవ్రతను ప్రస్తావిస్తూ బీజేపీని ఆత్మరక్షణలో పడేసేలా కాంగ్రెస్ తన సోషల్ మీడియా విభాగాన్ని రంగంలోకి దింపింది. మరోవైపు బీజేపీ ఈ కేసును నేరుగా బండి సంజయ్ రాజకీయ ప్రతిష్టపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తోంది. ప్రధాని మోదీ సభ , హిందూ ఏక్తా యాత్రల సమయంలోనే ఈ కేసును వెలుగులోకి తేవడం వెనుక లోతైన కుట్ర ఉందని బండి సంజయ్ ఆరోపిస్తున్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నా కుమారుడిని టార్గెట్ చేశారు అనేది బీజేపీ ప్రధాన వాదన. అంతేకాకుండా, బాధితురాలు మైనర్ కాదని, ఆమెకు రెండు వేర్వేరు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు ఉన్నాయనే వార్తలను బీజేపీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ వచ్చింది. అయితే బీజేపీకి ఏదీ కలసి రాలేదు. బాధితురాలు మైనర్‌గా తేలడంతో జైలుకు వెళ్లక తప్పలేదు. ఈ గొడవ వల్ల క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం భగీరథ్ వ్యక్తిగత విషయం కాదని, పార్టీ గౌరవానికి సంబంధించిన అంశంగా వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం తన న్యాయ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దీనిని ఒక ఉదాహరణగా చూపిస్తోంది. ఈ రెండు పార్టీలను ప్రజల్లో దోషులుగా నిరూపించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసు దర్యాప్తు వేగం పుంజుకునే కొద్దీ తెలంగాణ రాజకీయం మరిన్ని మలుపులు తిరగడం ఖాయం.

కొత్త కేసులతో ఇబ్బందులు: బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసిన కొద్దీ ఈ కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. తాజాగా ఈ కేసులో పోలీసులు నిందితుడు బండి భగీరథ్‌పై మరింత కఠినమైన బీఎన్ఎస్ సెక్షన్‌ను జోడించారు. ఒకే బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు ఉండటంతో పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి బండి భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (ఃబొ) లోని 64(2)(ఎ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఈ సెక్షన్‌ను జోడించడంతో నిందితుడికి చట్టపరంగా ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఈ కొత్త కేసు ప్రకారం తప్పు చేసినట్లు రుజువైతే భగీరథ్‌కు 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని తెలుస్తోంది. బాధితురాలి నుంచి సేకరించిన మరికొన్ని వివరాలు, సాంకేతిక ఆధారాల ప్రకారమే పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న బండి సాయి భగీరథ్‌ను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. జైలు నిబంధనల ప్రకారం నేడు వారు చర్లపల్లి జైలుకు వెళ్లి ములాఖత్ ద్వారా భగీరథ్‌ను కలవనున్నారు. కఠినమైన సెక్షన్లు తోడవడంతో తదుపరి లీగల్ ప్రాసెస్, బెయిల్ పిటిషన్లపై ఈ ములాఖత్‌లో కుటుంబ సభ్యులు, న్యాయవాదులు చర్చించే అవకాశం ఉందిబండి భగీరథ్ పోక్సో కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా నిందితుడికి మద్దతుగా విపరీతంగా ప్రచారం నిర్వహిస్తూ, అతడు నిర్దోషి అని చిత్రీకరించే ప్రయత్నం చేసిన పలువురు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో మొత్తం 27 మంది ఇన్ఫ్లుయెన్సర్లపై ఫిర్యాదులు రాగా, ప్రాథమిక విచారణ అనంతరం అందులో 14 మందిపోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన వారిపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యూత్ లీడర్షిప్ సదస్సు



నిర్మల్, మే:20(తెలంగాణ వాణి ప్రతినిధి): "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. "యూత్ లీడర్ షిప్ సమ్మిట్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. యువజన, క్రీడల శాఖ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటీఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో నిలిచి ఉన్న ధాన్యాన్ని..

# వెంటనే కొనుగోలు చేయాలి

**అధికారుల నిర్లక్ష్యంతోనే ధాన్యం కొనుగోలలో జాప్యం**

**భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ వేణుగోపాల్ రెడ్డి**

హుస్నాబాద్ మే 20 (తెలంగాణ వాణి ఆర్ సి): అక్కన్నపేట మండలం నుండి దాదాపు 60 ట్రాక్టర్లు ఐకెపి,సొసైటీ కేంద్రాల నుండి వచ్చిన ధాన్యం దాదాపు నాలుగు రోజుల నుండి మార్కెట్ యార్డ్ లోకి వచ్చిన ధాన్యాన్ని కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కొనుగోలు ఆలస్యం అవుతుందని, కేవలం15 మందిని హమాలీలను పెట్టి అన్లోడ్ చేయడం వల్ల ట్రాక్టర్ యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇన్చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు. వారు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే ధాన్యం కొనుగోలు ఆలస్యం జరుగుతుందని, మార్కెట్ యార్డ్ లోకి ధాన్యం తీసుకువచ్చే వాహనాలకు సెక్యూరిటీ లేకుండా పోతున్నదని ధాన్యం లోడింగ్ లో ఉండి రోజుల కొలది వాహనాలు నిలిచి ఉండడంతో వాహనాల నుండి జాకీలు, కవర్లు దొంగతనానికి గురవుతు న్నాయని ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అధిక లోడుతో వాహనాలు నిలిచి ఉండడంతో టైర్లకు హెయిర్ వచ్చి టైర్లు పగిలిపోయే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యమైన సమాధానం చెబుతున్నారని, ఇష్టముంటే హమాలీలను ఉంచుతాము లేకుంటే ఈ హమాలీలను తీసుకెళ్తామని బహాటంగా చెప్తున్నారన్నారు. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలు జిల్లా కలెక్టర్ కు,స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఏమాత్రం పట్టించుకోక పోవడం పై పట్టించుకోవడం పట్ల, రైతులపై కలెక్టర్ రైతుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుందని



అన్నారు. అన్ని గ్రామాలలో కూడా త్వరగా కొనుగోలు చేయడంలో ఐకెపి, సొసైటీ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందినారని అన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించు కోని హుస్నాబాద్ లో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించాలని,నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి, కలెక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరుగుతున్న నిర్లక్ష్యపు కాంట్రాక్టర్ పై చర్యలతో పాటు, దాదాపు మూడు నాలుగు రోజుల నుండి అక్కన్నపేట మండలం నుండి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేనిచో భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనచేపడతామని కవ్వ వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు.

## 'మొక్కజొన్న, వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలి'

**ఏఐకేఎంఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి డిమాండ్**




కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 20 : మొక్కజొన్న, వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతుందని మొక్కజొన్న, వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని, మార్కెట్‌లో దళారీలను కట్టడి చేయాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని, రైతులకు పెండింగ్ లో ఉన్న డబ్బులను చెల్లించాలని కోరుతూ అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం-ఇల్లెందు - పాల్వంచ క్రాస్ రోడ్‌లో సడక్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల మొక్కజొన్న, వడ్లు తడిసి తీవ్రంగా రైతులు నష్టపోయారని, అలాగే మార్కెట్‌లో నిల్వ ఉన్న ధాన్యం కూడా తడిసిపోతుందన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా లారీలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, జిల్లాలో సరిపడా గోడాన్స్ ను అందుబాటులో ఉంచకపోవడం వల్ల రైతులు పంటలను నిల్వ చేసుకోలేకపోయారన్నారు. అలాగే ప్రభుత్వం సకాలంలో వరి ధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయకపోవడం వల్ల వ్యాపారులకు తక్కువ ధరకే ధాన్యం అమ్ముకోవాల్సి వస్తుందని, 60 శాతంకు పైగా ధాన్యం తక్కువ రేటుకు వ్యాపారుల చేతుల్లోకి వెళ్తుందని దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సొమ్ము వ్యాపారులు, మార్కెట్ చైర్మన్, సొసైటీ చైర్మన్లులు ప్రభుత్వ అధికారులు, దళారులు పంచుకు తింటున్నారని ఆయన అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వలన ఇంకా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 15, 20 రోజుల్లో డబ్బులను ఖాతాలో జమ చేయాలని, యాప్ నమోదుపై అవగాహన లేని రైతులకు అవగాహన కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బట్టు ప్రసాదు, గూగులోత్ రామచంద్రు, కొమరం సత్యనారాయణ, మెస్ గోపాల్ పెద్దగోని ఆదిలక్ష్మి, మల్లోజు సుగుణ, రమేష్, కల్తి వెంకటేశ్వర్లు, ఉప్పరబోయిన రామ్మూర్తి, వెంకట్రాం, లిక్కి నరేష్ పాల్గొన్నారు.

## సీఎం సొంత ఊరిలో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



నాగర్ కర్నూల్, మే 20 (తెలంగాణ వాణి) : నాగర్ కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. గ్రామీణాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన కలెక్టర్ఏటీసీ సెంటర్, మోడల్ స్కూల్ నిర్మాణ స్థలాలను పరిశీలించి 5 ఎకరాల ప్రభుత్వ స్థలంపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ఆధునిక సదుపాయాలతో ప్రారంభమైన మిల్క్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. పాల సేకరణ, టెస్టింగ్ విధానాలపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్ పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి సేవలు మెరుగుపరచాలని సూచన నిర్మాణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలన్న కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులపై సమీక్ష: గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సంప్ పనులను పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరిక డ్రైనేజ్ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుదల ప్రజారోగ్యానికి కీలకమన్న కలెక్టర్, తాగునీరు, రహదారులు, విద్య, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచన గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ వ్యాఖ్య గ్రామస్థులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని అధికారులకు సూచన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్ పర్యటనలో అదనపు కలెక్టర్ దేవ సహాయం సహా పలువురు అధికారులు పాల్గొన్నారు



# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దు

**కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల:మే 20(తెలంగాణ వాణి ప్రతినిధి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్న శక్తి రైస్ మిల్, అంతర్గాం, మోరపల్లి గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను, మేడిపల్లి మండలంలోని సురభి సూర్య రైస్ మిల్, మాచాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలన కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు



కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని ప్యాడి ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను, మిల్లర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధు సూదన్, జివాకర్ రెడ్డి, డి ఎస్ ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణనకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలి

**డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల ?**

పాల్వంచ మే 20 (తెలంగాణ వాణి) :తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న జనగణన నమోదుకు వచ్చే సిబ్బందికి సరైన వివరాలు తెలిపి, సహకరించాలని డీసీఎంస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాతపాల్వంచ గడియకట్టలోని కొత్వాల స్వగృహంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో, కొత్వాల సతీమణి 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ప్రారంభించారు. జనగణన సిబ్బందికి కొత్వాల వివరాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, చేపట్టే నిర్ణయాలు, గ్రామ, పట్టణాల అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన, వంటి కార్యక్రమాలు అన్నీ జనాభా లెక్కల ఆధారంగానే ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కూడా జనగణనకు వచ్చే సిబ్బందికి సమగ్ర సమాచారం ఇవ్వాలని కొత్వాల అన్నారు.

?ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ సోడి పద్మ, వీరబోయిన కిషోర్, కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com